ఇరివెంటి బాలసాహిత్యం



యువభారతి

ఆంధ్ర సారస్వత పరిషత్తు భవనాలు,

తిలక్ రోడ్, హైదరాబాదు – 500 001.

పిల్లలు

అంత నచట;
తన శిశువును ఒడినిడుకొని చన్నుకుడుపుచున్న మాత
పిల్లల విషయము నడుగగ యిటుల పలికె అల్‌ముస్తఫ -
మీ పిల్లలు కానెకారు మీ పిల్లలు
సతతము జీవింపకోరు జీవనపు కొడుకులు కూతుళ్లు వారు.
వారు పుడమి జేరుకొనగ ద్వారంబులు తలితండ్రులు
మీ ద్వారనె కాని వారు మీనుండి రారెపుడును
మీకడనున్నను వారలు మీ వారలు కానెకారు
మీ ఆస్తివంటివారు కారు మీ పిల్లలు.
మీ ప్రేమను వలసినంత వారిపైన ఒలికించుడు
ఆలోచనలను మాత్రము వారి తలల రుద్దకుడు, ఏలన -
వారలకును వారిస్వంత ఆలోచనలు కలవు.
వారి దేహాలను కాపాడెడి గేహాలను నిర్మించుడు
కాని వారి యాత్మలకై పంజరాల నల్లకుడు, ఏలన -
ఆ ఆత్మలు నివసించును భవిత్యపు ఆలయమున
ఆ ఆలయ దర్శనము కలనైనను కాదుమీకు.
పిల్లలవలె వర్తింపగ ప్రయత్నింపవచ్చు మీరు
మీ వలె వారిని చేయగ యత్నింపగరాదెప్పుడు, ఏలన -
జీవనము వెనుకకు నడువదు
భూతము చేజిక్కి బ్రతుకు తన్నుకలాడదు, ఆగదు
ప్రాణముగల బాణములటు
బాలల సంధించి విడువ ధనువులు మీ తనువులంతే.
అంతులేని భవితవ్యము లక్షించుచు
ధనుర్ధరుడు తన బాణము లతిదూరము రువ్వడిగా పోవాలని
తన శక్తిని ప్రయోగించు మిమ్ము లొంగదీసి వంచు
ఆ ధనుర్ధరుని చేతులలో మీ లొంగుట ఎల్లప్పుడు సుఖవంతమె
హాయిని చేకూర్చునదే అగును, ఏలన -
రివ్వున బోయెడి బాణము వలెనే కదలక నిలిచిన ధనువును సయితము
ప్రేమించును ధనుర్ధరుడు.

ఖలీల్ జిబ్రాన్ "ది ప్రాఫెట్"కు కాళోజీ తెలుగుసేత 'జీవనగీత' నుండి

ఇరివెంటి బాలసాహిత్యం

ఇరివెంటి కృష్ణమూర్తి

యువభారతి
ఆంధ్ర సారస్వత పరిషత్తు భవనాలు,
తిలక్ రోడ్, హైదరాబాదు - 500 001.

ఇరివెంటి బాలసాహిత్యం

ప్రచురణ సంఖ్య 173

ముద్రణ : 24, ఆగష్టు, 2008
(సర్వధారి కృష్ణాష్టమి)

ప్రతులు : 500

వెల : రూ॥ 20-00

ప్రతులకు :
యువభారతి
ఆంధ్ర సారస్వత పరిషత్తు భవనాలు,
తిలక్ రోడ్, హైదరాబాదు - 500 001.

ముద్రణ :
వాగ్దేవి ప్రింటర్స్
నల్లకుంట, హైదరాబాద్-44
ఫోన్ : 27673772

సాహితీ మిత్రులు, యువభారతి శ్రేయోభిలాషులు
డా. ఏడుదొడ్ల జంగారెడ్డి, M.D.
శ్రీమతి ఏడుదొడ్ల శశికళా రెడ్డి గారలు
1705 - West Drive, San Marino
Los Angles - California 91108 - U.S.A.
ఈ పుస్తక ప్రచురణ నిమిత్తమై రూ.5000/- అందజేసినందులకు
కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

మా మాట

సాహితీ సాంస్కృతిక సంస్థగా యువ భారతి నలభై ఐదేళ్ల క్రితం 1963లో విజయ దశమినాడు ఆవిర్భవించింది. ఉత్తమ సాహిత్యాధ్యాయనం వల్ల వ్యక్తిత్వానికి సమగ్రత చేకూరుతుంది. సమాజంలో సామరస్యం పెంపొందుతుంది. ఉత్తమ భావప్రసరణానికి పుస్తకాలు చక్కని సాధనాలు. అందరికీ అందుబాటులో ఉండే విధంగా, మంచి పుస్తకాలను అందించే ప్రయత్నానికి యువభారతి పూనుకుని, పాతకొత్తల మేలు కలయికను ప్రాతిపదికగా పెట్టుకుని గడచిన నలభై ఐదేళ్ళ కాలంలో నూట డెబ్బై రెండు పుస్తకాలను ప్రచురించింది. ప్రస్తుతం ఆచార్య వంగపల్లి విశ్వనాథం గారి ఆధ్వర్యంలో యువకులకోసం ప్రతి నెల మొదటి ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు నగర కేంద్ర గ్రంథాలయంలో వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలను ఉచితంగా నిర్వహిస్తున్నది.

యువభారతి సంస్థ అభివృద్ధికి తన కాలాన్నీ, కలాన్ని, గళాన్ని అంకితం చేసి తన చివరి శ్వాస వరకూ, నిస్వార్థ భావంతో అధ్యక్షులుగా వుండి సంస్థను ముందుకు నడిపించిన మనస్వి, మనీషి, తపస్వి డా॥ ఇరివెంటి కృష్ణమూర్తిగారు, యువ భారతీయులకు కొండంత అండగా ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుని చిరస్మరణీయులయ్యారు. యువ భారతీయులు కవులుగా, రచయితలుగా, వక్తలుగా అన్నింటికీ మించి బాధ్యతగల పౌరులుగా తయారు కావడానికి వారి ప్రోత్సాహమెంతో వుంది. కృష్ణమూర్తిగారు సంస్కృతాంధ్ర ఉర్దూ హిందీ ఆంగ్లభాషలలో పండితులు. ఉత్తమ ఉపన్యాసకులు, సహృదయ విమర్శకులు, విద్వత్పరిశోధకులు, హాస్యవచో విన్యాస చతురులు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీకి, ఆంధ్రసారస్వత పరిషత్తుకూ కార్యదర్శిగా, ఇతర సాహితీ సాంస్కృతిక సంస్థలకు వారుచేసిన సాహిత్య సేవ మరువరానిది.

బాలలు సున్నిత హృదయులు. వారి ఉజ్జ్వల భవిష్యత్తు కోసం చిన్నతనంలో సద్భావ బీజాలు నాటాలి. వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి. అందుకోసం వారికి అర్థమయ్యే రీతిలో మంచి రచనలు చేయాలి. ఇరివెంటివారు ఆ మార్గంలో కొంత ప్రయత్నం చేశారు.

బాలలను "దేశమును ప్రేమించుమన్నా" (పుట-1) అంటూ వారిని మహనీయుల "అడుగుజాడల"(పుట-9)లో నడవమనీ అందుకు తగిన "వెలుగుబాటలు" (పుట-19) చూపిస్తూ, "వేగుచుక్కలు"(పుట-28)గా పేర్కొనదగిన వారిని ప్రశంసిస్తూ "వెలుగుచూపే తెగులుపద్యాల"(పుట-35)ను వివరణాత్మకంగా వెలువరించారు ఇరివెంటివారు. ఇంతకు ముందు వారు వ్రాసిన వ్యాసాలను చిన్న పుస్తకాలుగా ప్రచురించాం. ఇప్పుడు వాటినన్నింటిని కలిపి ఇరివెంటిబాల సాహిత్యం (వ్యాససంకలనం)గా వారి 78వ జయంతి సందర్భంగా వారికి అక్షర జోహారులర్పిస్తూ ప్రచురిస్తున్నాం.

యువభారతి కార్యక్రమాల ద్వారా స్ఫూర్తినిపొంది, ఈ పుస్తక ప్రచురణకు ఆర్థిక సహాయం అందించిన అమెరికాలో స్థిరపడిన శ్రీమతి ఏదుదొడ్ల శశికళారెడ్డి, డా॥ ఏదుదొడ్ల జంగారెడ్డి M.D. గారలకు యువభారతి కృతజ్ఞతలు తెలియజేస్తున్నది....

హైదరాబాదు
24.8.2008 (కృష్ణాష్టమి)

మాడభూషి అనంతాచార్య,
అధ్యక్షుడు, యువభారతి.(9290702328)

యువభారతి ఫౌండేషన్

(రిజిష్టర్డ్)

పరిచయం

ఉత్తమ సాహిత్యాధ్యయనం సమాజంలో సామరస్యాన్ని పెంపొందించుతుంది. మనిషిలో అంతర్లీనంగా నిక్షిప్తమై ఉన్న ప్రతిభను వెలికి తీస్తుంది. సాత్త్విక తత్త్వాన్ని పెంపొందిచుకోడానికి దోహదం చేస్తుంది. ఈ ఆశయంతో 1963లో విజయదశమినాడు యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ ఆవిర్భవించింది. ఇప్పటి వరకు అనేక సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించింది. 172 పుస్తకాలను ప్రచురించింది. అందులో అనేక ప్రచురణలు ఉన్నత ప్రమాణాలు గల గ్రంథాలుగా గుర్తింపు పొందాయి.

ఈ నేపథ్యంలో తెలుగు భాషా, సాహిత్య సంస్కృతులను మరింత అభివృద్ధిపరచి, 16 కోట్ల మంది తెలుగు వారిలో మాతృభాషాభిమానాన్ని పెంచి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి ఒక శాశ్వత నిధిని ఏర్పాటు చేయాలని భావించి యువభారతి మిత్రులతో యువభారతి ఫౌండేషన్ స్థాపించబడింది.

తెలుగు భాషా సాహిత్యం సంస్కృతుల ప్రాచుర్యంతో వ్యక్తి సంపూర్ణ వికాసం, సమాజ పురోగమనం, దేశ సంక్షేమం కోసం పాటు పడుతూ, అందుకు గల అవకాశాలను పెంపొందిస్తూ, సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలలో మంచిని పెంచుకొనే తత్త్వాన్ని ప్రేరేపించడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యం.

ఈ ఆశయాల సాధన కోసం పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, గ్రంథాలయాలు, సాహితీ సాంస్కృతిక సంఘాలు, ఉపన్యాస వేదికలు, పరిశోధనా సంస్థలు, ఇవే ఆశయాలు కలిగిన ఇతర సంస్థలతో కలిసి కార్యక్రమాలను రూపొందించి నిర్వహించాలని తలపోస్తున్నది.

తెలుగు వారికి యువభారతి ఫౌండేషన్ కొన్ని సూచనలు :

1. మీరు ఇంటా బయటా తెలుగువారితో తెలుగులోనే మాట్లాడండి.
2. మీరు ప్రతిరోజు ఏదైనా తెలుగు దిన/వార/పక్ష/మాస పత్రికలు తప్పక చదవండి.
3. తరచు మీకిష్టమైన తెలుగు సాహిత్యాన్ని చదవండి.
4. మీ పిల్లలు పాఠశాలలోగాని, కళాశాలలోగాని చదువుతుంటే వారు తెలుగు భాషను తప్పనిసరిగ (అధ్యయనాంశంగా) చదివేటట్టు చేయండి.
5. తెలుగువారితో ఉత్తర ప్రత్యుత్తరాలను తెలుగులోనే రాయండి.
6. తెలుగు భాషాభివృద్ధికి మీచేతనైన సహకారం అందించండి.

మీ సలహా సహకారాలకు సంప్రదించవలసిన మా చిరునామా :

యువభారతి ఫౌండేషన్

ఇం.నెం.3-6-207/1, మఖ్దూం మార్గము,
15వ వీధి, హిమాయత్‌నగర్, హైదరాబాదు - 500 029.

"దేశమును ప్రేమించుమన్నా"

"దేశమును ప్రేమించుమన్నా - మంచి అన్నది పెంచుమన్నా" అన్నారు గురజాడ అప్పారావుగారు. ఆయనే -

"దేశమంటే మట్టికాదోయి - దేశమంటే మనుషులోయి" అన్నారు.

ఇంత సులభమైన మాటల్లో ఆయన ఎలా బ్రతకాలో, ఎలా దేశాన్ని అర్థం చేసుకోవాలో మనకు తెలపడానికి ప్రయత్నించినారు. దేశాన్ని అంటే దేశంలోని ప్రజలను ప్రేమించేవాడు ఎప్పుడూ తప్పుడుపనులు చేయడు. తన దేశమంటే అభిమానమున్నవాడు తనకు నష్టం వచ్చినా, కష్టం వచ్చినా దేశానికి లాభం కలిగితే చాలు అని నమ్ముతాడు. దేశంలో పుట్టినవాళ్ళంతా కష్టనష్టాలకు ఓర్చి దేశం కోసం పాటుబడతారా? కాకపోవచ్చు. కాని, కొందరైనా అలాంటి వాళ్ళు లేకపోతే దేశం అన్నివిధాల చెడిపోతుంది. తనకోసం కాక, ఇతరులకోసం బ్రతికే వాడివల్లనే దేశానికి లాభం కలుగుతుంది. తన ఒక్కడివల్ల ఏమౌతుంది? అని భావించేవాడు, ప్రత్యక్షంగా గాకపోయినా పరోక్షంగా దేశానికి కష్టం కలిగించినవాడే అవుతాడు.

మంచి అన్నది పెంచడమంటే ఏమిటి? మంచికీ, చెడుకీ ఏమిటీ భేదం? కాలాన్నిబట్టి, దేశాన్నిబట్టి, అవసరాన్ని బట్టి, మంచికీ చెడుకీ భేదాలు ఏర్పడుతూ ఉంటాయి. తనకు మంచిదైంది. మరొకరికి చెడ్డది కావచ్చు. తాను బ్రతుకుతున్న కాలంలో చాలామందికి మంచిదిగా తోచిన ఒక విషయం, మరోకాలంలో ఎంతో మందికి చెడ్డగా తోచవచ్చు. మనిషికి మంచిచెడ్డలు తెలుసుకోవడం అవసరం. పుస్తకాలు చదువుకున్నంత మాత్రాన, లేదా పెద్ద మాటలు కొన్ని వల్లించినంత మాత్రాన, మనిషి అక్షరాస్యుడనిపించుకుంటాడే తప్ప, జ్ఞాని అనిపించుకోడు. అందరికోసం గ్రంథాలయాల్లో పెట్టిన పుస్తకాలను అక్రమ మార్గాలలో సొంతం చేసుకునేవాళ్ళు, చదువుకొన్నవాళ్ళే కదా? దేవాలయాల్లోని విగ్రహాలను ఎత్తుకొని పోయి అమ్ముకునే వాడికి, వీధి దీపాలుగా వెలుగుతున్న బల్బులను ఎత్తుకొని పోయేవాడికి, టిక్కెట్టులేకుండా ప్రజలడబ్బుతో నడిచే బస్సుల్లోను, రైళ్ళలోను ప్రయాణం చేసేవాడికి ఏమీ తేడా లేదు. పెద్ద పెద్ద అధికారాల్లో ఉండి లంచాలు తీసుకుని ప్రజల పనికి ఎగనామం పెట్టేవాళ్ళు చదువుకున్నవాళ్ళే కదా? గురజాడ "మంచి అన్నది పెంచుమన్నా" అన్న ఆలోచనలోని మంచి ఏమిటి?

ఈ సంగతి తెలుసుకోవడానికి మనం కొంచెం ప్రయత్నం చేయాలి. మన దేశం మీద ప్రేమ పెంచుకొని, మన దేశంలో చాలాకాలంనుంచి ప్రజలు చదువుతూ, నమ్ముతూవస్తున్న పుస్తకాలను కొన్నిటిని చదవాలి. అలాంటి వాటిలో రామాయణం, మహాభారతం ముఖ్యమైనవి. మన భారతీయులకు వాల్మీకి ఆదికవి. ఆయన ఒక ఆదర్శ మానవుని కథను అందంగా, పాడుకోడానికి చదువుకోడానికి అనుకూలంగా వ్రాసినాడు.

ఆయన తరువాత వ్యాసుడు అనే గొప్ప రచయిత మన దేశంలో పుట్టి, ఎన్నో పుస్తకాలను వ్రాసినాడు. వాటిల్లో ఆయన వ్రాసిన ఒక్కొక్కమాటకీ, ఈనాడు కూడా మేధావులు వ్యాఖ్యానాలు చేస్తున్నారు. ఆయన మనకు ఎన్నో కథలు చెప్పినాడు. మనిషి జీవితానికి పనికివచ్చే అనేక విషయాలను చెప్పినాడు. మనం జరుపుకొనే పండుగలకు పబ్బాలకు మూలం ఆయన రచనల్లో దొరుకుతుంది. పుట్టింది మొదలు గిట్టే వరకు మనిషి చేసే ప్రతిపనికి వెనుక ఉన్న కారణం ఆయన రచనల్లో కనబడుతుంది. ఎన్నో ఆచారాలకు, సాంప్రదాయాలకు వ్యాఖ్యానాలు ఆయన రచనల్లో దొరుకుతాయి. ప్రతి భారతీయుని ఆలోచనల మీద వ్యాసుని ప్రభావం కనపడుతుంది. కనుక మంచి చెడ్డల స్వరూపాన్ని, స్వభావాన్ని తెలుసుకోవడానికి మహాభారతం చదవవలసిందే. ధర్మాధర్మ విషయాలలో మనకెప్పుడు సందేహం కలిగినా భారతం చదవాలి. అందుకే వ్యాసుని భారతాన్ని తెలుగులో అందించిన తిక్కన -

"వేదములకు, నఖిల స్మృతి
వాదములకు, బహుపురాణ వర్గంబులకున్
వాదైన చోటులను దా
మూదల ధర్మార్థకామమోక్షస్థితికిన్"

అంటూ, వేదాల విషయంలోను, స్మృతి పురాణాల విషయంలోనూ, ధర్మార్థ కామమోక్షాల విషయంలోను, అనుమానం కలిగినప్పుడు నిజమేదో తెలుసుకోవాలంటే భారతాన్నే నమ్ముకోవాలని వివరించినాడు.

తిక్కన మహాభారతంలో ఏది మంచి, ఏది చెడు, ఏది ధర్మం, ఏది అధర్మం, ఏది అన్ని ధర్మాలకంటే గొప్ప ధర్మం అన్న ప్రశ్నలకు సమాధానం చాలాచోట్ల దొరుకుతుంది. అన్నిటికంటే చేయదగిన మంచిపని ఏమిటి? అన్న ప్రశ్నకు సమాధానం తిక్కన ఈ క్రింది విధంగా స్పష్టపరచినాడు.

"ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబునకగు
తానొరులకు నవిసేయకునికి
పరాయణము పరమ ధర్మ పథముల కెల్లన్"

ఇతరులు చేసిన దానిలో నీ మనస్సునకు ఏది ఇష్టం లేదో, ఏది బాధ కలిగిస్తుందో అది నీవు ఇతరులకు చేయకుండావుండాలి, అదే ధర్మం. అన్నిటికంటే గొప్ప ధర్మం. ఒకడు దొంగతనం చేస్తున్నాడనుకో. అది నీకు ఇష్టం లేదు. నీ మనస్సుకెంతో బాధ కలిగించింది. నీవాపని చేయకు - అంతే.

ప్రతి మనిషీ, తాను ఈ లోకంలో అందరితోపాటు బ్రతుకు తున్నావనే భావంతో ఉండటం అవసరం. తాను పాయసం త్రాగుతున్నా తృప్తిలేదతనికి. ఆ పాయసానికి నోచుకోలేని నిర్భాగ్యులు తన చుట్టూ ఉన్నారన్నదే అతనికి తృప్తి. లోకానికి అతని వల్ల చాలా బాధ

కలుగుతుంది. తనకు లేకపోయినా ఇతరులకు దొరకాలనే తపన, మనిషిని దేవుణ్ణిగా మలుస్తుంది.

కూటికీ, గూటికీ, గుడ్డకు నోచుకోలేని అతికష్టజీవుల కన్నీళ్ళను తుడవాలనుకొన్నాడు లెనిన్ మహాశయుడు. రష్యాలో ఎన్నో కష్టాలను ఓర్చి ఆ మహానుభావుడు, దారిద్ర్యం మనుషులు కలిపించుకున్నదే గాని సహజమైనది కాదని పెద్ద పెట్టున ఉద్యమం లేవదీసి, మనుషులను పశువులకంటె హీనంగా చూసే బలవంతుల ప్రభుత్వాన్ని కూలగొట్టి, రైతుల, కూలీల రాజ్యాన్ని స్థాపించినాడు. మనుషులను, మంచిని, ప్రేమించిన మనిషి అతడు. నిజమైన దేశభక్తుడతడు.

సరిగ్గా అదే కాలంలో, అంటే లెనిన్ దుష్ట శక్తులను అణచిన కాలంలో, మన భారతదేశంలో దేశమంటే మనుషులను కున్న జ్ఞానమూర్తి గాంధీమహాత్ముడు గొప్ప ఆందోళన లేవదీశాడు. అప్పుడు మనదేశం ఇంగ్లీషు వాళ్ళ ఇనుపపాదాల కింద అణిగిపోతున్నది. లక్షలాది ప్రజలు దారిద్ర్యానికి, క్షామాలకు, దౌర్జన్యానికి బలియైపోతున్నారు. గాంధి కలవారి కుటుంబంలో పుట్టినవాడే, ఇంగ్లండుకు వెళ్ళి గొప్పగా చదువుకున్నవాడే, అయినా ఆయనను ఆ ఇంగ్లీషు చదువులు ఏమీ చేయలేకపోయినవి. వ్యాసుని భగవద్గీతను చదివి అతడు అన్యాయానికి ఎదురొడ్డి నిలచినాడు. పాలకులైన ఇంగ్లీషు వాళ్ళను ఆయన శత్రువులనుకోలేదు; అజ్ఞానంతో, స్వార్థంతో, ఇతర దేశాల సంపదను బలవంతంగా కబళిస్తున్నారని మాత్రం అన్నాడు; భారతదేశాన్ని వదలి పొమ్మని చాలా ప్రేమతో సలహా ఇచ్చినాడు. కాని, ఆ పరాన్న భుక్కులకు అంటే, ఇతరులు కష్టించి సంపాదించుకున్న అన్నాన్ని బలవంతంగా లాక్కుని తినేవాళ్ళు, ఆయన మాటను వినలేదు. మహాత్ముడు ఆయుధాలు లేకుండానే, ప్రజల అభిప్రాయాలను సమీకరించి ఒక గొప్ప శక్తిగా నిలచినాడు. భారతదేశంలో బ్రతికే చాలా మందికి లేని సుఖం, తనకు మాత్రం ఎందుకని అతి సామాన్యుని వలె బతికినాడు. ప్రసాదాలను వదలిపెట్టి పాకలలో ఉన్నాడు. అంటరానివాళ్ళు లోకంలో లేరని చాటినాడు. పేదలను ఆదుకోవడం ధనికుల తక్షణ కర్తవ్యం అని ప్రకటించినాడు. ధనికుల వద్ద ఉండే డబ్బంతా సమాజానిదేనని, వాళ్ళు కేవలం ఆ డబ్బుకు ధర్మకర్తలుగా ఉండవలసినవారనీ ప్రచారం చేసినాడు. నిరుపేదలనీ, ధనికులనీ, సమాజాన్ని విడదీయడం తప్పనీ, మంచి చెడులు అందరిలోను ఉంటాయనీ, మనిషి పేదవాడైనా సరే, ధనికుడైనా సరే, మంచిని పెంచాలి, దేశం కోసం బ్రతకాలి, సాధ్యమైనంత వరకు అవసరాలను తగ్గించుకోవాలి. తన సుఖం కోసం ఇతరులను ఉపయోగించుకొనే పద్ధతి అనాగరికమైనదనీ తెలుపుతూ ఆయన ఎన్నో రచనలు చేసినాడు. తాను తన రచనలకు, తానన్న మాటలకు అనుకూలంగా బ్రతుకును మలచుకొన్నాడు. "నిర్బలులకు రాముడే బలము" అని చెబుతూ, కలిమిలేని వాళ్ళను ఆదుకున్న వాడే మనిషి, అదే మంచితనం, ఆ మంచితనం లేనివాడు, ఏ మతంవాడైనా తన్ను తాను మోసపుచ్చుకుంటున్న వాడే అని బోధించాడు.

ప్రభుత్వం కొన్ని కోట్ల రూపాయలను ఖర్చుపెట్టి విద్యాలయాలను నడుపుతున్నది. మంచిపుస్తకాలను అందిస్తున్నది. విద్యార్థులు బాగా చదువుకోవాలి. పరిశుభ్రంగా ఉండాలి. కలిసికట్టుగా ఉండాలి. తమకంటే బాగా చదువుకున్న గురువులపట్ల భక్తి శ్రద్ధలతో ప్రవర్తించాలి. రేపు ఈ దేశంలో సుఖంగా బ్రతకవలసినది తాను అనే తెలివితో మసలుకోవాలి. దొంగల కథలను, దయ్యాల కథలను, అక్రమంగా డబ్బు సంపాదించుకునే వాళ్ళ కథలను చదివి కాలాన్ని వ్యర్థం చేసుకోకూడదు. తల్లీ, తండ్రీ, గురువు – ఈ ముగ్గురు తన భవిష్యత్తుకు బాటలు వేసేవారని నమ్మాలి. తన సంతోషాన్ని, అభివృద్ధిని చూసి నిండుగుండెలతో సంతోషించేవాళ్ళు ఈ ముగ్గురేనని గ్రహించాలి. అందుకే, మన పెద్దలు ఈ ముగ్గురిని కనబడే దేవతలు అన్నారు. "మాతృదేవోభవ – పితృదేవోభవ – ఆచార్యదేవోభవ" అన్న వేదంలోని మాటలకు అర్థం ఇదే. దేశాన్ని ప్రేమించడం, మంచిని పెంచడం అనే ఈ రెండు లక్షణాలు బాగుపడదలచుకున్న ఏ జాతికైనా అవసరము.

మనదేశంలో ఎత్తైన, అందమైన హిమాలయ పర్వతాలున్నాయి. అన్ని కాలాలలోను తీయని నీళ్ళను అందిస్తూ మన బ్రతుకులను పండిస్తూ పారుతున్న గంగ, గోదావరి లాంటి నదులున్నాయి. ప్రపంచంలోని చాలా దేశాల ప్రజలకు బట్టకట్టడం తెలియని రోజులలో మానవునికి మహోన్నతమైన ఆదర్శాలు అందించిన సాహిత్యం మనకున్నది. ఎన్నెన్ని అందమైన అడవులు, ఎన్నెన్ని అందమైన పక్షులు, ఎన్నెన్ని సొగసులను అందించే వృక్షసంపద! ఎన్నెన్ని వింత వింత జంతువులు! ఎన్నెన్ని తేనెలొలికే భాషలు! ఎన్నెన్ని కలలకు కూడా అందని అందాల శిల్పాలు! కాశ్మీరం మొదలుకొని కన్యాకుమారివరకున్న విశాలభారతదేశం మనది.

"ఏ మంచి పూవులన్ ప్రేమించినావో –
నిను మోచె ఈ తల్లి కనకగర్భమున
ఏ పూర్వ పుణ్యమో ఏ యోగబలమో –
జనియించినాడవీ స్వర్గఖండమున"

అని రాయప్రోలు సుబ్బారావుగారు అన్నారు.

నిజంగా ఈ దేశంలో మనం పుట్టడం మన అదృష్టం. ఇంత అందమైన దేశం, రత్నాలు కడుపులో పొదుగుకున్న దేశం మన కేమిచ్చింది? అని తిక్క ప్రశ్న వేసిన దానికంటే, మన మీ దేశానికి చేస్తున్నదేమిటి? అన్న ప్రశ్న వేసుకోవడం మంచితనానికి గుర్తు. నీకు చదువు వచ్చిందంటే, నీ గుండె దీపం వెలిగిందన్నమాట. దీపం మరొక దీపాన్ని వెలిగించినట్లే, గుండె మరో గుండెలో ధైర్యాన్ని నింపాలి. ఊరటను నింపాలి. నీకు తెలిసిన జ్ఞానాన్ని ఇతరులకు పంచిపెట్టు. దీపం ఎంత పెద్దదైతే అంత వెలుగును చిమ్ముతుంది. జ్ఞానం ఎంత ప్రసరిస్తే దేశం అంత సుఖపడుతుంది. అందుకే, మన పెద్దలు జ్ఞానాన్ని వెలుగుతోను, అజ్ఞానాన్ని చీకటితోను పోల్చినారు. జ్ఞానాన్ని సంపాదించుకొనే సందర్భంలో పోటీ పడటం నేర్చుకోవాలి. ఒకరిని మించి ఒకరు అజ్ఞానం మీద దండయాత్ర చేయడానికి తయారవ్వాలి.

అంతేగాని, ఆస్తిపాస్తుల విషయంలో, కులమతాలపట్టింపుల విషయంలో, స్పర్ధలు పెంచుకోవడం అజ్ఞానం.

గురజాడ "పూను స్పర్ధలు విద్యలందే" అని ఎప్పుడో మనకు చెప్పినాడు.

"కం కాలః కానిమిత్రాణి, కోదేశః కావ్యయాగమౌ
కశ్చాహం కాచమేశక్తిః, ఇతి చిన్త్యం ముహుర్ముహుః
యేనకేన ప్రకారేణ, యస్యకస్యాపి దేహినః
సంతోషం జనయేత్ప్రాజ్ఞః తదేవేశ్వరపూజనం"

మంచి పెంచుకోవాలనుకున్నవాడు, తనకు తెలియకుండానే దేశానికి మేలు చేకూరుస్తూ ఉంటాడు. కేవలం దేవుణ్ణి పూజిస్తే సరిపోదు. దేవుళ్ళకు, దేవేరులకు జాతరలు చేస్తే సరిపోదు. కమ్మకమ్మగా ప్రసాదాలుచేసుకొని తింటే సరిపోదు. ఏవో పాపాలు చేసి, ఆ పాపాల నుంచి తప్పించమని రకరకాల సేవలుచేస్తే దైవపూజ అనిపించుకోదు. తాము దైవభక్తులమని లోకానికి చాటుకుంటే ప్రయోజనం లేదు. గుడి తలుపులు చేయించి, తలుపుల మీద ఇది తాను చేసిన పుణ్యమని ప్రకటించుకుంటే పుణ్యం రాదు. దేవుడు సంతోషించడు. కాలమంటే ఏమి? స్నేహితులంటే ఎవరు? దేశమంటే ఏమి? ద్రవ్యం ఎలా వస్తుంది? అసలు నేను ఎవణ్ణి? నా శక్తిసామర్థ్యాలు ఏపాటివని, అన్నివేళలా ఆలోచించుకుంటూ ఉండేవాడే ప్రాజ్ఞుడు. ఏ జీవికైనా ఆనందాన్ని కలిగించగలిగితే, లేదా ఏ పని చేస్తే తన చుట్టూరా ఉండే ప్రజలు సుఖాన్ని అనుభవిస్తారో అలాంటి పని చేయడమే దైవపూజ. అన్ని జీవులకు మేలుకలిగేటట్టు ప్రవర్తించడమే, తోటి మానవుల కష్టాలను తీర్చడమే, నిజమైన పూజ.

"యోగ వాశిష్ఠం" అనే ఒకమంచి పుస్తకమున్నది. అందులో -

"పరోపకార కారిణ్యా, పరార్తి పరితప్తయా
బుద్ధ ఏవసుఖే మన్యే స్వాత్మశీతలయా ధియా"

ఏ మనిషి మనస్సులో, మాటలో, చేతలో ఎల్లప్పుడు ఇతరులకు ఉపకారం జరగాలని ఉంటుందో, ఏ మనిషి హృదయం పరుల కష్టాలను చూసి తల్లడిల్లిపోతుందో, అలాంటి చల్లని మనస్సున్న మహాత్ముడే ఎప్పుడూ సుఖంగా ఉంటాడు. అంటే, నిజంగా సుఖపడాలని కోరుకునేవాడు, ఇతరులకోసం పాటుపడటం నేర్చుకోవాలి. మంచితనం అంటే ఇదే.

మనం సాధారణంగా దేశాన్ని, ప్రపంచాన్ని సతమతపెడుతున్న సమస్యలనుగూర్చి ఆలోచించేవాణ్ణి, వాటికి తనకు తోచినవేవో పరిష్కారాలను సూచించేవాణ్ణి మేధావి అంటూ ఉంటాం. నిజానికి, మేధావి అంటే మంచిని పెంచేవాడు. మేధావి లక్షణాలను ఆర్యులు ఇట్లా వివరించినారు.

"క్లిశ్యన్నపిచ మేధావీ, శుద్ధం జీవన మాచరేత్

తేనేహ శ్లాఘ్యతామేతి, లోకేభ్యశ్చనహీయతే"

ఎన్నికష్టాలు వచ్చినా తొణకక, లొంగిపోక, పరిశుద్ధమైన నడవడి కలిగినవాడు మేధావి.

వ్యాసుడు ఒకచోట మహాభారతంలో అంటాడు.

"వృత్తం యత్నేన సంరక్ష్యం - విత్తమేతిచ యాతిచ
అక్షీణో విత్తతః క్షీణో - వృత్త తస్తు హతో హతః"

మనిషి ఎంతో ప్రయత్నంచేసి తన నడవడిని చక్కదిద్దుకోవాలి. ధనం గొప్పది కాదు. ప్రధానమైంది కాదు. అది వస్తూ ఉంటుంది. పోతూ ఉంటుంది. ధనంలేనంత మాత్రం చేత, ఎవ్వడూ హీనుడు కాదు. కాని, సౌశీల్యం లేనివాడు, అంటే సత్ప్రవర్తన లేనివాడు, ఎప్పటికైనా హీనుడే అని ఈ శ్లోకం చెబుతున్నది.

"దేశాభిమానం నాకు కద్దని - వట్టి గొప్పలు చెప్పుకోకోయ్
పూని ఏదైనాను ఒక మేల్-కూర్చి జనులకు చూపవోయి."

గురజాడ మన ఆధునిక తెలుగు కవితారీతులకు వేగుచుక్క వంటివాడు. ఆయనరాసిన దేశభక్తి గీతం అన్ని దేశాలకు, అన్ని మతాలకు వర్తించేది.

దేశం మీద తనకు చాలా అభిమానముందనీ, తాను దేశ భక్తుణ్ణనీ చెప్పుకునేవాళ్ళను మనం వెతికి చూడవలసిన అవసరం లేదు. వాళ్ళంతా, ఒట్టి గొప్పలు చెప్పుకొనే వాళ్ళని గురజాడ ఎన్నడో అన్నాడు. దేశభక్తి అంటే దేశంలోని ప్రజల కష్టాలను అర్థం చేసుకొనేశక్తి, ఆ శక్తికి మంచినడవడితోడైతే దేశంలో మనుషులకు ఉపద్రవాలు ఉండవు.

స్వాతంత్ర్యదినోత్సవం నాడు, రిపబ్లిక్‌దినోత్సవంనాడు మనం మన విద్యాలయలాల్లో, ఇళ్ళలో, కార్యాలయాలలో, కార్ఖానాలలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి అభివందనాలు సమర్పించుకొంటాము. ఎందుకు పతాకానికి వందనం చేయడం? మనం, మన దేశం, మన దేశ ప్రజలు, ఏ ఆదర్శాల కోసం ప్రతి నిముషం కృషి చేస్తున్నారో, ఆ ఆదర్శాలపట్ల మనకు విశ్వాసం ఉన్నదనీ, నమ్మకం ఉన్నదనీ అభివందనం చేస్తాం. ప్రతిజ్ఞలు చేస్తాం. మన భారతజాతి గౌరవ ప్రతిష్ఠలకు ఆ జెండా ఒక గుర్తు. ఆ జెండాలోని ఎరుపురంగు త్యాగానికి, తెలుపురంగు స్వచ్ఛతకు, ఆకుపచ్చ రంగు సస్యశ్యామలత్వానికి గురుతులు. పతాకం మధ్య అలనాటి అశోకుని 'ధర్మచక్రం' ఉంటుంది. ప్రపంచ చరిత్రలో "ప్రజలు నా బిడ్డలు" అని గ్రహించిన మొట్టమొదటి చక్రవర్తి అశోకుడు. ప్రజల హృదయాలను ఏలిన మహారాజు అతడు. ఏ ప్రాణికీ బాధ కలిగించకూడదని శాసనాలు చెక్కించిన ప్రేమమూర్తి అతడు. కత్తిని పారేసి అభయహస్తంతో భారత ప్రజలను ఏలిన కరుణామూర్తి అతడు. 'అహింసా పరమోధర్మః' అని బోధించిన బుద్ధ భగవానుని సిద్ధాంతాలను ప్రచారం జేసిన బౌద్ధుడతడు. ఆయన రాజ్యానికి చిహ్నం "ధర్మచక్రం". ఆ ధర్మచక్రమే మన పతాకంలో వెలుగుతున్నది. మన ముప్వన్నెల పతాకానికి నమస్కరించడం ముచ్చటకాదు - 'దీక్ష'.

మంచికోసం పోరాడుతామని 'దీక్ష'. కలసిమెలసి ఉంటామని దీక్ష. దేశం కోసం, దేశం మంచికోసం, దేశగౌరవం కోసం, ఎంత త్యాగానికైనా వెనుదీయమనే 'దీక్ష'. వెన్నెల ఎంత స్వచ్ఛంగా ఉంటుందో, ఎంత చల్లగా ఉంటుందో, అట్లా మా మనస్సులను మలచుకొంటామనే 'దీక్ష'.

ఈ త్రివర్ణపతాకం మన స్వాతంత్ర్య సమరాన్ని జ్ఞప్తికి తెస్తుంది. ఎందరో పురుషులు, ఎందరో స్త్రీలు, ఎందరో బాలలు దేశమాత కోసం స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సమర్పించుకొన్నారు. ఎందరో ఉరికంబాల నెక్కినారు. ఎందరో తల్లులు తమ పుత్రులను కోల్పోయినారు. ఎందరో స్త్రీలు తమ భర్తలను కోల్పోయినారు. ఒక్క రక్తపు చుక్క చిందకుండా మన స్వాతంత్ర్యసమరం సాగింది. అన్ని రాష్ట్రాలలోని దేశభక్తులు సింహాలవలె గర్జించినారు. ఇంగ్లీషు పాలకుల కుతంత్రాలను ఎదుర్కొన్నారు. పరిపాలకులకు అర్థమయ్యే భాషలోనే శక్తిమంతమైన రచనలు చేసినారు. అశోకుడు, అక్బర్, శివాజీ, రాణా ప్రతాప్, ఝాన్సీ లక్ష్మీబాయి, వీరపాండ్య కట్టబొమ్మన, అల్లూరి సీతారామరాజు వంటి గొప్పగొప్ప భారతీయ ఇతిహాస నిర్మాతలను, వాళ్ళు సాధించిన విజయాలను, వాళ్ళు కాపాడిన సంస్కృతిని, వారు భారతాంబకు సంపాదించి పెట్టిన యశస్సును గానం జేసినారు.

మన చరిత్రను మనకు తప్పులతడకగా అందించి, మన భాషలను దాసులభాషలని పిలిచి, ఎంతో గౌరవహీనంగా ప్రవర్తించిన ఇంగ్లీషువారికి నిజాలు చూపి, తమ వ్యక్తిత్వాన్ని నిలుపుకున్నారు. అందుకే, 1947లో మనకు స్వాతంత్ర్యం లభించిన తరువాత కూడా ఇంగ్లీషువారు తాము చేసినదంతా మరచిపోయి స్నేహసంబంధాలు నెలకొల్పుకున్నారు. గ్రేట్ బ్రిటన్ రాజధాని లండన్ నగరంలో గాంధీ మహాత్ముని విగ్రహాన్ని నిలిపి గౌరవించినారు. మన స్వాతంత్ర్య సమర నాయకులలో అగ్రేసరుడైన పండిత జవహర్‌లాల్ నెహ్రూను, "ద్వేషాన్ని, భయాన్ని జయించిన సత్పురుషుడు" అని బ్రిటిష్ సామ్రాజ్యానికి పెట్టనికోటయైన చర్చిల్ అభివర్ణించినాడు.

తెలివితేటలలో మనం, ఏ దేశం వారికి తీసిపోము. మంచి నడవడిని అలవరచుకొని, మన దేశాన్ని ప్రేమించడం మన కర్తవ్యం.

ఎప్పటికీ పాడుకోవడానికీ, మననం చేసుకోవడానికీ మనకు గురజాడ అప్పారావుగారి "దేశభక్తి" అనే సందేశగీతం ఇక్కడ మీ కోసం అందిస్తున్నాను. ఈ పాట నేర్చుకొని దీనికి అర్థం చెప్పమని మీ పెద్దల నడగండి. ఇంత మంచి దేశభక్తి గీతం రావడం మన భాష నోచుకున్న నోముకు ఫలితం.

దేశభక్తి

దేశమును ప్రేమించుమన్నా - మంచి అన్నది పెంచుమన్నా
వొట్టిమాటలు కట్టిపెట్టోయి - గట్టిమేల్ తలపెట్టవోయి!
పాడిపంటలు పొంగిపొర్లే - దారిలో నువు పాటుపడవోయి,
తిండి కలిగితే కండ కలదోయి - కండ కలవాడేను మనిషోయి!
యీసురోమని మనుషులుంటే - దేశమేగతి బాగుపడునోయి?
జల్దుకొని కళలెల్ల నేర్చుకు దేశి సరుకులు పెంచవోయి!
అన్ని దేశాల్ క్రమ్మవలెనోయి - దేశి సరుకుల నమ్మవలెనోయి,
డబ్బు తేలేనట్టి నరులకు - కీర్తి సంపద లబ్బవోయి!
వెనక చూసిన కార్యమేమోయి - మంచి గతమున కొంచెమే నోయి
మందగించక ముందు అడుగేయి - వెనకబడితే వెనకేనోయి.
పూను స్పర్థను విద్యలందే - వైరములు వాణిజ్యమందే
వ్యర్థ కలహం పెంచబోకోయి - కత్తివైరం కాల్చవోయి!
దేశాభిమానం నాకు కద్దని - వట్టి గొప్పలు చెప్పుకో కోయి,
పూని ఏదైనాను ఒక మేల్ - కూర్చి జనులకు చూపవోయి!
ఓర్వలేమి పిశాచి దేశం - మూలుగులు పీల్చెసెనోయి,
ఒరుల మేలుకు సంతసిస్తూ - ఐకమత్యం నేర్పవోయి!
పరుల కలిమికి పొర్లియేడ్చే - పాపికెక్కడ సుఖం కద్దోయి!
ఒకరి మేల్ తనమేలనెంచే - నేర్పరికి మేల్ కొల్లలోయి!
స్వంత లాభం కొంత మానుకు - పొరుగువాడికి తోడు పడవోయి!
దేశమంటే మట్టి కాదోయి - దేశమంటే మనుషులోయి!
చెట్టా పట్టాల్ పట్టుకుని - దేశస్థులంతా నడవ వలెనోయి!
అన్నదమ్ముల వలెను జాతులు - మతములన్నీ మెలగవలె నోయి!
మతం వేరైతేను యేమోయి?- మనసులొకటై మనుషులుంటే
జాతమన్నది లేచి పెరిగి - లోకమున రాణించునోయి!
దేశమనియెడి దొడ్డ వృక్షం - ప్రేమలను పూలెత్తవలెనోయి
నరుల చెమటను తడిసి మూలం - ధనం పంటలు పండవలెనోయి!
ఆకులందున అణగి మణిగి - కవిత కోకిల పలకవలెనోయి
పలుకులను విని దేశమందభి - మానములు మొలకెత్తవలెనోయి!

✪✪✪

అడుగు జాడలు

ఎండకు బాగా కాగిపోయిన భూమిపైన చిన్న చిన్న వాన చినుకులు చిటపటా పడుతున్నాయి. ఏవో కొత్త కొత్త కమ్మ కమ్మని సువాసనలతో చల్లగా గాలి వీస్తున్నది. చెట్ల ఆకులూ కొమ్మలూ ఆ గాలికి ఊగుతున్నాయి. రెప రెపలాడుతున్నాయి. ఒక తాతయ్య చాలా ఉత్సాహంతో భూమిని చిన్న గడ్డపారతో తవ్వుతున్నాడు, ఒక మామిడి మొక్క నాటడానికి. అది చూసి చుట్టూరా ఉండే పిల్లలూ పెద్దలూ ఆ తాతయ్య చుట్టూ మూగినారు. పిల్లలేదో వింతగా చూస్తుంటే, పెద్దలు – "ఏమయ్యా! ఇంత వయసొచ్చింది. రేపో మాపో ఈ లోకాన్ని విడిచిపొయ్యేటట్లున్నావు. ఈ మొక్క పెద్దదై ఎప్పుడు పూస్తుంది? ఎప్పుడు కాస్తుంది? దీని పండ్లు నీవు తినాలని ఈ మొక్క నాటుతున్నావా? వయస్సు మళ్లినవాడవు. ఎంత ఆశ నీకు?" – అని ఎగతాళి చేసినారు. అప్పుడు ఆ తాతయ్య చిన్న నవ్వు నవ్వి – "నాకు మాత్రం తెలియదా? ఈ చెట్టు పండ్లు ఇదుగో! ఈ కుర్రాళ్ల కోసం. ఇప్పుడు మనకు దొరికే మామిడి పండ్లన్ని మన తాతలు నాటిన చెట్లవే కదా! కష్టపడి ముందుచూపుతో ఏదైనా పనిచేస్తే కొంతకాలం తరువాత లాభం కలుగుతుంది. మనం మన ముందు తరాల కోసం, వాళ్ళ మంచికోసం బంగారు బాటలు వేయాలి" అన్నాడు. అప్పుడా పెద్దలు – "నిజమే! నిన్ను ఎగతాళి చేయడం మా తప్పే. మేము ఇంత దూరం ఆలోచించలేదు. మన పిల్లలు బాగుపడాలంటే మనమే పూనుకోవాలి. వాళ్లు మనలను చూసి మంచి ఏదో చెడు ఏదో తెలుసుకుంటారు. మనకు తప్పు అని తెలిసిన దానిని చేయకుండా ఉంటే పిల్లలు కూడా చేయరు" – అన్నారు.

ఏ పనికైనా దానికి తొలిదశ అంటూ ఒకటి ఉంటుంది. మొదట్లోనే తప్పుచేస్తే చివరకు ఆ తప్పు మరింత పెద్దదవుతుందే కాని ఒప్పుగా మారదు. అక్షరాలు సరిగా నేర్చుకోకపోతే మనం పెద్ద చదువులు చదువుకోలేము కదా! అందుకే సుఖపడాలనుకున్న వాళ్లు కష్టపడవలసిందే. కష్టపడకుండానే అదృష్టం వల్ల ఏదో సుఖం దొరుకుతుందనుకోవడం పొరపాటు. కష్టపడకుండా దొరికే సుఖం ఎంతో కాలం ఉండదు. దానివల్ల మనసుకు ఊరట కూడా ఉండదు. ఎప్పుడు అది మనలను విడిచిపోతుందోనన్న భయం మనస్సులో దూరి నెమ్మది లేకుండా చేస్తుంది. మీకు ఇలా చెపుతుంటే నాకు ఒక సూక్తి జ్ఞాపకానికి వస్తున్నది. అది సంస్కృతభాషలోనిది. సంస్కృత భాష చాలా గొప్ప భాష. కొన్ని వేల ఏళ్లనుంచి అది మన భారతదేశంలోని ప్రజలకు మంచి మంచి పుస్తకాలను అందిస్తూ వస్తున్నది. మన దేశంలోని భాషలు – అంటే తెలుగు, కన్నడం, హిందీ, మరాఠీ, బెంగాలీ, గుజరాతీ, ఉర్దూ, మళయాళం ఇంకా మరింకెన్నో భాషలు సంస్కృతం నుంచే బలాన్ని పుంజుకున్నాయి. ఎన్నో సామెతలు, ఎన్నో సూక్తులు – అంటే మంచి మాటలు, ఎన్నో కథలు, ఎన్నో శాస్త్రాలు సంస్కృతం ద్వారానే మన దేశంలోని భాషలకు వచ్చినవి. సంస్కృతం నేర్చుకున్నవాడు భారతదేశంలోని ప్రజల మనస్సును తెలుసుకోగలుగుతాడు. సంస్కృత

భాష భారతదేశంలో చాలా మందికి రాకపోవచ్చు. కానీ ఆ భాష మనకు కనపడకుండానే మనందరిలో 'మనమంతా ఒక్కటే' అనే భావాన్ని కలుగజేస్తున్నది. బాబూ! అమ్మా! సంస్కృత భాషలో ఉన్న ఒక నూరు పద్యాలను మీరు నోటికి నేర్చుకోండి. సంస్కృతం తెలిసిన పెద్దల నడిగి అర్థం తెలుసుకోండి. మీకు అప్పుడు తెలుస్తుంది, సంస్కృత భాష ఎంత గొప్పదో. అది తెలిస్తే మీకెంత గొప్పతనం వస్తుందో? నాకేదో సంస్కృత సూక్తి జ్ఞాపకానికి వచ్చిందన్నాను కదూ! ఆ సూక్తి ఇది -

"వర్షార్థమష్టౌ ప్రయతేత మాసాన్
నిశార్థమర్థం దివసే యతేత
వార్ధక్య హేతోర్వయసా నవేన
పరత్ర హేతో రిహజన్మనాచ."

మనుష్యుడు వాన కాలానికి సరిపోయే సరుకులను మిగిలిన ఎనిమిది నెలలో సంపాదించుకోవాలి. రాత్రికి కావలసిన దానిని పగటివేళల్లో సంపాదించు కోవాలి. ముసలితనంలో కావలసిన దానిని వయస్సులో ఉన్నప్పుడు సాధించుకోవాలి. పరలోకంలో సుఖంగా ఉండాలంటే ఇహలోకంలో - అంటే బతికి ఉన్న కాలంలోనే సంపాదించుకోవాలి అని ఈ సూక్తికి అర్థం.

మన దేశం బాగు పడాలన్నా, మన బ్రతుకు బాగు పడాలన్నా మనం చిన్నతనంలోనే మంచి అలవాట్లు, మంచి స్నేహం, మంచి మాటలు, మంచి నడవడి అలవరచుకోవాలి. గురువులంటే ఏదో జీతంరాళ్ల కోసం పాఠాలు చెప్పుకొని బ్రతికేవాళ్ళు అన్న చులకన భావాన్ని మనస్సులో నుంచి తీసివేయాలి. బడి అంటే గుడి అనుకోవాలి. అంటే - చదువుల తల్లి గుడి అని. మన దేశానికి మన తెలివి తేటలు పనికి వచ్చేటట్టు ఆ బడి మనలను తీర్చిదిద్దుతుంది. విచ్చలవిడిగా తిరగడానికి, కొంటె పనులు చేయడానికి బడిని ఉపయోగించుకోగూడదు. దేశం మీద ప్రేమ, దేవుని పట్ల భక్తి, తల్లీ తండ్రీ గురువులపట్ల ఆదరం ఉన్న వాడే నిజమైన విద్యార్థి అనిపించుకుంటాడు. విద్యార్థిగా ఉన్నప్పుడు సాధ్యమైనంత వరకు అవసరాలను తగ్గించుకొని ఆడంబరంలేకుండా మసలుకోవడం నేర్చుకోవాలి.

మన దేశానికి గొప్ప కీర్తిని సంపాదించి పెట్టిన మహానుభావులు చాలా మంది ఉన్నారు. తమ శక్తిని అంతా ధారపోసి పరాయి పాలన నుంచి దేశానికి విముక్తిని కలిగించినారు. గొప్పగా చదువుకున్నారు. తరతరాల నుంచి మన దేశాన్ని పట్టి పీడిస్తున్న గుడ్డి నమ్మకాలను వాళ్ళు ఎదుర్కొన్నారు. మంచి పనులు చేస్తే తమకు లాభం కలుగకపోయినా దేశానికి లాభం కలిగితే చాలు అనే భావంతో వాళ్ళు ఎంతో సేవను చేసినారు.

మన దేశానికి నాయకులైన కొందరు పెద్దల సంగతులు మీకు తెలియజేస్తాను. వాళ్ళకు ఎదురైన కష్టాలే మనకుకూడా ఎదురవుతాయని అనుకోకండి. దేశం, కాలం, సమాజం ఎప్పుడూ మారుతూనే ఉంటాయి. మనకు మరోరకమైనన కష్టాలు రావచ్చు. అయితే వాటిని ఎదుర్కొవడానికి మనకు ధైర్యం కావాలన్నా. మెలకువలు కావాలన్నా,

ఓపిక కావాలన్నా దేశం అంటే మనకు ప్రేమ ఉండాలి. గురువంటే గురి ఉండాలి. అప్పుడు ఏ కష్టాలూ మనలను ఏమీ చేయలేవు. మన దేశ నాయకులందరూ కష్టాలను ఎదురుకున్నారంటే వాళ్ళకు అంతశక్తి ఎక్కడ నుంచి వచ్చింది? దేశభక్తి వాళ్లకు కొండంత శక్తినిచ్చింది. చక్కగా చదువు కోవాలనే కోరిక వాళ్లకు చక్కని దారి చూపింది.

మీరెప్పుడైనా 'ప్రాతస్మరణీయులు' అనే మాట విన్నారా? ఈ మాటను అనడమే కష్టం. అర్థం చేసుకోవడం అంతకంటే కష్టం. కానీ చాలా మంచిమాట. మనం తెలుసుకోవలసిన మాట. పొద్దున్నే లేచి మనకు మేలు చేసిన వాళ్ళనూ మనకు దారి చూపిన వాళ్ళనూ తలచుకుంటాం. ఎవరిని పొద్దున్నే ఒకసారి తలచుకుంటే మనకు మంచి పనులు చేయాలనే ఉత్సాహం కలుగుతుందో, వాళ్లు 'ప్రాతఃస్మరణీయులు'. ఈ ప్రాతఃస్మరణీయుల్లో రాముడూ, కృష్ణుడూ వంటి దేవతలూ ఉన్నారు. ఏసుక్రీస్తూ, గాంధీ మహాత్ముడూ, గౌతమబుద్ధుడూ వంటి మానవోత్తములూ ఉన్నారు. మనకు బుద్ధిచెప్పే గురువులూ ఉన్నారు. పొద్దున్నే లేచి ఈలాంటివాళ్ళను తలచుకోవడంవల్ల మంచి పనులు చేయాలనే ఉత్సాహం కలుగుతుంది.

మన దేశం కోసం ఎన్నో కష్టాల పాలై మన జాతిని నిలబెట్టి మనకు స్వాతంత్ర్యాన్ని సంపాదించి యిచ్చిన కొందరు ప్రాతః స్మరణీయులను గూర్చి మీకు కొన్ని సంగతులు చెపుతాను.

మన భారతదేశం సువిశాలమైనది. సోవియట్ రష్యాను మినహాయిస్తే ఐరోపా ఖండం ఎంత ఉంటుందో మన దేశం అంత ఉంటుంది. అయితే ఇప్పుడున్న ఐరోపా ఖండంలో ఎన్నో స్వతంత్ర రాజ్యాలున్నాయి. కాని మనదేశంలో అట్లాకాదు. ఈ విశాలమైన భూఖండమంతా ఒకే రాజ్యంగా ఉన్నది. రకరకాల వాతావరణాలూ, రకరకాల భాషలు, రకరకాల జీవిత పద్ధతులూ ఉన్నాయి. అయినా మనదంతా ఒకే జాతి. మనకంతా ఒకే పతాకం. దాదాపు నూటపదికోట్ల జనాభా మన దేశానికి ఉన్నది. అన్ని విధాలా చాలా విచిత్రమైన దేశం మనది. కొన్నివేల సంవత్సరాల చరిత్ర మనది. కొన్ని వేల సంవత్సరాల జీవిత పద్ధతి మనకున్నది. జనాభాలో చాలామందికి వ్రాయడానికీ చదవడానికీ రాదు. అయినా జీవితాన్ని గూర్చి, మతాన్ని గూర్చి, మంచి నడవడిని గూర్చి వాళ్ళకు తరతరాలుగా అందుతున్న జ్ఞానం ఎక్కువగా ఉన్నది. ఈలాంటి దేశానికి ప్రధానమంత్రి కావడం అదృష్టం అనుకోవడం పొరపాటు. అద్దంలోనే ఏదైనా వస్తువు నీడ స్పష్టంగా కనిపించినట్లు సమర్థతలోనే అదృష్టం కనిపిస్తుంది.

ఒక ఆరు నెలల పిల్లవాడు ఒక జాతరలో తల్లికి దూరమైపోయినాడు. పసులకాపరులకు దొరికినాడు. అయితే పోలీసులు ఆ పిల్లవాణ్ణి మళ్ళీ ఆ తల్లికి అప్పజెప్పినారు. అప్పుడు తల్లికి దొరకకపోతే ఆ పిల్లవాడు పసులకాపరిగా పెరిగి పెద్దవాడయ్యేవాడేమో! కానీ అదృష్టం మలుపు తిరిగింది. ఆ పిల్లవాడే ఈ సువిశాల భారతదేశానికి ప్రధానమంత్రి అయినాడు కొంతకాలానికి. అతడే లాల్‌బహదూర్‌శాస్త్రి. ఆయన అదృష్టం కలిసొచ్చి అంతవాడు

కాలేదు. మంచి పనిని సాధించాలనే పట్టుదల, అంతకంటే గొప్పదైన నిజాయితీ, ఆ రెండింటి కంటే గొప్పదైన గుణం - అదే తనమీద నమ్మకం, ఈ గుణాలు ఆయనను ఇంత పెద్ద దేశానికి ప్రధానిని చేసినవి. ఆయన పొట్టిగా ఉండేవాడు. భాగవతంలోని వామనమూర్తి కథను మీరు వినే ఉంటారు. బలిచక్రవర్తిని పాతాళలోకానికి పంపి ముల్లోకాల్లోనూ వ్యాపించిపోయినాడు ఆ పొట్టివాడు. ఇప్పటికీ ఎవడైనా పొట్టివాడు గొప్ప పనులుచేస్తే "అమ్మో వామనుడు- సామాన్యుడు కాడు" అంటారు మన శాస్త్రి కూడా అలాంటివాడే. పెద్దగా ఉపన్యాసం చేయడం ఆయనకు రాదు - గొప్ప గొప్ప డిగ్రీలు కూడా ఆయనకు లేవు. కాశీ విద్యాపీఠ్‌లో ఆయన చదువుకొని 'శాస్త్రి' అనే బిరుదు తెచ్చుకొన్నాడు. ఆయన పేరు లాల్‌బహదూర్. శాస్త్రి బిరుదు మాత్రమే. ఆయన గొప్ప ఇంట్లో పుట్టలేదు. నిరుపేద కుటుంబం ఆయనది. చిన్నతనం నుంచే ఆయనను తన పేదరికం, తన దీనస్థితి ఎంతో బాధపెట్టినాయి. చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకున్నాడు.

ఆయన చిన్నతనంలోనే ఒక సంఘటన చెపుతాను. ఒకనాడు తోటి పిల్లలతో కలిసి ఒక తోటలో తోటమాలికి తెలియకుండా కొన్ని పూలు కోసుకున్నాడు. తోటమాలి పట్టుకోవడానికి రాగానే పిల్లలంతా పారిపోయినారు. పాపం లాల్ బహదూర్‌ను పట్టుకొని తోటమాలి బాగా కొట్టినాడు. అప్పుడు లాల్‌బహదూర్ ఏడుస్తూ - "అయ్యా! నాకు నాన్నలేదు. నన్ను అన్యాయంగా కొట్టకు" అన్నాడు అప్పుడా తోటమాలి - "నాన్న లేకపోతే జాగ్రత్తగా మసులుకోగూడదా?" అన్నాడు. ఆ తోటమాలి అన్న ఆ మాటలను మళ్ళీ మళ్ళీ లాల్ బహదూర్ తన మనసులో ఇలా అనుకున్నాడు - "నిజమే! ఇంత చిన్నతనంలోనే నాన్న నన్నీలోకంలో వదిలిపెట్టి వెళ్లిపోయినాడు. కనుక నేను పిల్లలందరికంటే మంచి నడవడి అలవరచుకోవాలి. చక్కగా చదువుకోవాలి." అప్పటికి లాల్‌బహదూర్‌కు ఆరేళ్ళ వయస్సు. అప్పుడు చేసుకున్న ఆ నిశ్చయంతో తన బ్రతుకంతా మార్చుకున్నాడు. తనతో ఆడుకునే పిల్లలలోనే కాదు - జీవితంలో - అంటే స్వాతంత్ర్యంకోసం పోరాడుతున్న కాలంలో - తనతో పనిచేసే నాయకులకంటే అతడు బుద్ధిమంతుడని కీర్తి సంపాదించుకున్నాడు.

అవసరానికి సరిపోయేటంత ప్రతిఫలం తీసుకోవలసిందే కాని అంత కంటే ఎక్కువ తీసుకుని సొంత ఆస్తి పెంచుకోవడం, ఇంత వెనక వేసుకోవడం అంటే ఆయనకు అసహ్యం. పెళ్ళిలో అతణ్ణి మామగారడిగినారట - "కట్నం నీకెంత కావాలి?" అని. అప్పుడు - "ఒక రాట్నం కానుకగా ఇస్తే సంతోషిస్తాను" అని అన్నాడట లాల్‌బహదూర్. సంపాదించుకోవడానికి అవకాశం దొరికినా దానిని విడిచిపెట్టడమే త్యాగం. అందుకే లాల్‌బహదూర్ త్యాగమూర్తి అయినాడు.

ఉత్తరప్రదేశ్‌లో మంత్రిగా ఉన్నప్పుడు ఆయన ఉండే గదిని ఏర్ కండిషన్ చేసినారు. ఆయన అది చూసి "నేను ఇవాళ మంత్రిని. రేపు ఈ పదవి పోతుంది. అప్పుడు ఇలాంటి సుఖం దొరుకుతుందా? మనం కష్టాలకు అలవాటుపడడం నేర్చుకోవాలి. అప్పుడే దేశానికి ఏదైనా చేయాలి" అంటూ ఎంతో నొచ్చుకొని అధికారులకు చెప్పి, ఆ ఏర్‌కండిషన్

తీసివేయించినాడు.

త్యాగాన్ని గూర్చి చక్కని ఉపన్యాసం చేయవచ్చు. ఇతరులు చేసిన త్యాగాలవల్ల లాభపడవచ్చు. కానీ సులభంగా దొరుకుతున్న సుఖపడే అవకాశాలను విడిచిపెట్టడం నిజంగా త్యాగం అనిపించుకుంటుంది. ఆడంబరంతో జీవితాలు గడపుతూ ఉన్న నాయకులు లాల్‌బహదూర్‌శాస్త్రి వలె ప్రాతఃస్మరణీయులు కాలేరు. జాతికి పూజనీయులు కాలేరు. మంత్రిగా ఉన్నప్పుడు కూడా ఆయన పేదవాని బ్రతుకే బ్రతికినాడు. ఆయనకు వచ్చే జీతం గంపెడంత సంసారానికి సరిపోయేది కాదు. చిరిగిన చొక్కాలతోనే కాలం గడిపేవాడు. అతనికి ఆ జీతం తప్ప వేరే ఆస్తి ఏమీలేదు. 1964లో ఆయన భారత ప్రధానిగా ఉన్నప్పుడు తనకు పేదరికం అంటే ఏమిటో తెలుసుననీ, నెలకు రెండున్నర రూపాయల ఆదాయంతో తాను గడిపిన దినాలు కూడా ఉన్నాయనీ అన్నాడు. పాకిస్తాన్‌తో యుద్ధం వచ్చినప్పుడు ఆయన గుండె నిబ్బరం, సాహసం వల్ల దేశంలో దేశభక్తి అనంతశక్తిగా రూపొందింది. పాకిస్తాన్‌కు భారతజాతి బుద్ధి చెప్పగలిగింది.

ఆయన చనిపోయినపుడు అతని పేర బ్యాంకులో పైసా కూడా లేదు. బ్యాంకులో ఖాతాయే లేదు. సొంత ఇల్లు లేదు. కొడుకుకు చక్కని ఉద్యోగాన్ని కూడా సంపాదించుకోలేక పోయినాడు. ఆయన దేశానికిచ్చిన నినాదం – "జైకిసాన్, జై జవాన్". దేశంలోని ప్రజలలో నమ్మకాన్నీ, దేశభక్తినీ కలిగించాలంటే లాల్‌బహదూర్ శాస్త్రి వంటి నాయకులు దేశానికి అవసరం. తండ్రి నీడకు నోచుకోని లాల్‌బహదూర్ శాస్త్రి చిన్నతనం నుంచి మంచి నడవడినీ, త్యాగబుద్ధినీ అలవరచుకొని, ఉన్నత పదవిలో ఉన్నా సామాన్యునిలాగా తన జీవితాన్ని సాగించిన మహనీయుడు. గొప్పవాడు కావడానికి గొప్ప ఇంట్లో పుట్టాలని లేదు. గొప్ప బుద్ధులు అలవరచుకుంటే ఎంత లేనివాడైనా, ఎంత పేదవాడైనా అందరి కంటే గొప్ప వాడవుతాడు.

కమలం బురదలో పుడుతుంది. నీళ్ళల్లో పెరుగుతుంది. అయితే అది సంపదకు మారుపేరు. అందానికి మారుపేరు అది నీళ్లల్లో ఉన్నా నీళ్లుదానికి అంటవు. అలాగే మనం ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా మనకు మంచి నడవడి ఉంటే, మనకు మంచి ఆలోచనలు ఉంటే మనం స్వచ్ఛంగానే బ్రతుకుగలుగుతాం. ఇదే 'సంస్కృతి' అనే పెద్ద మాటకు అర్థం. ఈ సంస్కృతిని ఏ జాతి కాపాడుకుంటుందో ఆ జాతి లాల్‌బహదూర్ శాస్త్రి వంటి మహానుభావులను లోకానికి అందిస్తుంది.

✪ ✪ ✪

లాల్ బహదూర్ శాస్త్రికి ఆదర్శం ఎవరనుకున్నారు? గాంధీ మహాత్ముడు. ఏదైనా వస్తువు రుచి తియ్యగా ఉన్నది అంటే తేనెలా ఉందనో పంచదారలా ఉందనో పనసతొనలా ఉందనో అంటే వెంటనే మనకర్థం అవుతుంది. అలాగే నాయకుడంటే ఎవరు? అతడెలా ఉంటాడు? అని తెలుసుకోవాలనుకుంటే మనం గాంధీ మహాత్మునితో పోల్చడానికి ప్రయత్నం చేస్తాం. ఆయనలోని ఏ ఒక్క మంచి గుణమైనా ఎవరిలోనైనా ఉంటే అతణ్ణి మనం ఆదరిస్తాం.

దీనినే ఆదర్శం అంటాం. చాలా కాలంనుంచి మన భారతదేశంలో ప్రజలు పూజించేదీ, ఆదరించేదీ ఎవరిననుకుంటున్నారు? మనస్సులోనూ మాటలోనూ చేతలోనూ ఎవరు ఒకే విధంగా ఉంటారో - అంటే చెప్పే మాటలకు, చేసే చేతలకు భేదం లేకుండా ఎవరు మసలుకుంటారో వాళ్లను ఈ దేశంలోని ప్రజలు గౌరవిస్తారు. ఎందరో రాజులు, ఎందరో వీరులు, ఎందరో పండితులు ఈ దేశంలో పుట్టి కీర్తిని సంపాదించినారు. కానీ రాజుల్లో రాముడికే గౌరవం. వీరుల్లో భీష్ముడికే గౌరవం. పండితుల్లో వాల్మీకికే గౌరవం. ఏమీ తెలియనట్లే ఉంటారు సామాన్య ప్రజలు. కానీ ఎవరికి చేతులతో నమస్కారం చేయాలో, ఎవరికి మనస్సుతో సమస్కారం చేయాలో, ఎవరిని ఎంతవరకు నమ్మాలో వాళ్లకు బాగా తెలుసు. కనుకనే ఎంత చక్కగా ఉపన్యాసాలిచ్చినా, గాంధీ తాతతో పోల్చి చూస్తారు. 'త్రికరణశుద్ధి' అనే మాట ఒకటుంది. అది చాల పెద్ద మాట. మీకింతవరకే తెలిసి ఉంటుంది. నేను కూడా ఇప్పుడే మీకీవిషయం చెప్పినాను. 'త్రికరణశుద్ధి' అంటే మనస్సు, మాట, చేత ఒకటిగా ఉండడం. అంటే మనసులో ఒక ఆలోచన పెట్టుకొని నోటితో మరొకటి అని మరోవిధంగా చేస్తే అది 'త్రికరణశుద్ధి' అనిపించుకోదు. ఈ శుద్ధి ఉన్నవాడు మహాత్ముడు. మన భారతదేశపు చరిత్రలో వాల్మీకి, గౌతమ బుద్ధుడు, అశోకుడు, శంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు, వివేకానందస్వామి, దయానంద సరస్వతి, గాంధీమహాత్ముడు వంటి మహానుభావులు త్రికరణశుద్ధి కలిగిన వాళ్లే. ఈలాంటివాళ్ల జీవిత చరిత్రలను చదువడం వల్ల వాళ్ల సందేశాలను అర్థం చేసుకోవడం వల్ల ఎంతో జ్ఞానం కలుగుతుంది. బ్రతుకు బాటలోని చీకట్లూ కష్టాలూ దూరమవుతాయి. మనదేశం మీద, మన ప్రజల మీద మనకు ప్రేమ ఎక్కువ అవుతుంది. వాళ్లకు కష్టం కలిగించే ప్రయత్నం మనం ఎప్పుడూ చేయం.

గాంధీమహాత్ముని జీవితంలోని ఒకటి రెండు సంగతులు మీకు చెపుతాను.

కోటానకోట్ల భారతీయులకు పూజనీయుడైన గాంధీ తాతయ్య ఎలా ఉండేవాడు? మోకాళ్లదాకా ఉండే చిన్న పంచె కట్టుకునేవాడు. చొక్కాలేదు, పైన ఒక గుడ్డ. ఇదీ ఆయన వేషం. అయితే రాజులూ శ్రీమంతులూ పేదలూ బలవంతులూ బలహీనులూ అందరూ ఆయనకు భక్తితో వందనాలు చేసేవారు. ఆయనకు తనదంటూ ఏదీలేదు. దేశమే తనది. దేశ ప్రజలే తనవాళ్లు. దేశ ప్రజల్లో అన్ని విధాలా అన్యాయానికి గురైనవాళ్లు తనకు మరింత దగ్గరివాళ్లు. కాయకష్టం చేసి తినేవాళ్లే ఆయన దృష్టిలో నిజంగా మనుష్యులు. పరుల కష్టం మీద సుఖాన్ని పొందేవాళ్లు ధర్మం తెలియని వాళ్లని ఆయన చెప్పేవాడు. సేవాగ్రాం ఆశ్రమంలో ఒక చిన్న గుడిసెలో ఆయన ఉండేవాడు. దేశంలో ఎక్కడికైనా పోవలసివచ్చినప్పుడు సామాన్యులు ప్రయాణం చేసే రైలు పెట్టెలో ప్రయాణం చేసేవాడు. స్వచ్ఛత అంటే ఆయనకు ఎంతో ఇష్టం. పరిశుభ్రమైన పరిసరాలు మనిషిలో మంచిపనులు చేసే ఉత్సాహాన్ని కలిగిస్తాయని ఆయన నమ్మేవాడు. పరిశుభ్రత అంటే పైపైనే కాదు. మనస్సు కూడా శుభ్రంగా ఉంచుకోవాలి. అంటరానితనాన్ని నమ్మే మనస్సు శుభ్రమైంది కాదని ఆయన నమ్మి ప్రచారం

చేసినాడు. అట్లాగే మద్యపానం లాంటి చెడ్డ అలవాట్లు కూడా పరిశుభ్రమైనవి కావని ఆయన ప్రచారం చేసేవాడు. ఆయన ఇంగ్లీషులో చదువుకున్నాడు. ఇంగ్లాండుకు వెళ్లి చదువుకున్నాడు. అయినా ఆయనకు తన మాతృభాష గుజరాతి అంటే చాలా అభిమానం. భారతదేశానికంతటికీ ఒక జాతీయ భాష ఉండాలనీ, అప్పుడే దేశంలోని ప్రజలకు ఒక్కటిగా ఉండే అవకాశం ఎక్కువవుతుందనీ ఆయన నమ్మి, హిందీభాషా ప్రచారాన్ని ఒక నిర్మాణ కార్యక్రమంగా నడిపినాడు. భారతీయ భాషలన్నీ గొప్పవని ఆయన అనేవాడు.

జ్ఞానానికీ భాషకూ ఏమీ సంబంధం లేదు. ఏ భాషలోనైనా మంచి భావాలు ఉంటాయి. అందుకోసం మనం ఎప్పుడూ మన తెలుగు, తమిళం, మరాఠీ, హిందీ, బెంగాలీ వంటి భాషల గొప్పదనం తెలుసుకుంటూ ఉండాలి. ఇంగ్లీషు రానంత మాత్రం చేత మనకు జ్ఞానం లేదని అనుకోవడం పొరపాటు.

గాంధీ తాతయ్య ఒకసారి మన పొరుగు రాష్ట్రమైన ఒరిస్సాలో తిరుగుతున్నాడు. ఆయనతో ఒకరు ఇలా అడిగినారు – "మీరు ఇంగ్లీషు విద్యా పద్ధతిని ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? ఇంగ్లీషు చదువుకోవడం వల్లనే మీరింత గొప్ప వారైనారు కదా!" అప్పుడు గాంధీ తాతయ్య అన్నాడు కదా – "నేను ఏమంత గొప్పగా చదువుకున్నవాణ్ణి కాదు. మీరనుకున్నంత గొప్పవాణ్ణి కాదు. అందుకు నాగురించి నేనేమీ చెప్పను. చెప్పడానికి వీలు లేదుకూడా. కానీ లోకమాన్య తిలక్ మహాశయుడు ఇంగ్లీషులో చదువుకున్నాడు. ఇంగ్లీషులోగాక మాతృభాషలోనే చదువుకొని ఉంటే ఎంత గొప్పవాడయ్యేవాడో! శంకరాచార్యులూ తులసీదాసూ ఇంగ్లీషు చదువుకున్నారా? అలాంటి మహనీయులు లోకంలో ఎంత మంది ఉన్నారు? మన దేశంలో కొంతమంది ఇంగ్లీషు చదువుకొని గొప్పవాళ్లు అయినమాట నిజమే. కానీ వాళ్లు వట్టి ఇంగ్లీషు వల్లనే గొప్పవాళ్లు కాలేదు. అలాంటి వాళ్లు ఎవరైనా ఉంటే వాళ్లు చాలా తక్కువ. ప్రాచీన కాలంలో మన భాషల్లో చదువుకొని చాలామంది ఋషులైనారు. మహాపురుషులైనారు. ఇంగ్లీషు చదువుకొని గొప్పవారైన వారికంటే వాళ్లు మహానుభావులు కాదా?' మన దేశ ప్రజలలో తమ భాషపట్ల ఎంత ఆత్మ విశ్వాసం పెంచినాడు ఆ మహానుభావుడు! అందుకే ఆయన జాతి నిర్మాత.

"ఆత్మవత్సర్వభూతాని" అనే సంస్కృతం మాట నీవెప్పుడైనా విన్నావా? ఇది చాల పెద్దమాట. దీని అర్థం తెలిసిన వాడికే దేశసేవ చేసే అధికారం, అవకాశం దొరుకుతుంది. ఈ మాటలకు అర్థమేమిటో చెపుతాను. నీకు నీ పట్ల ఎంత శ్రద్ధ, ఎంత అభిమానం, ఎంతమమత ఉన్నదో, అన్ని జీవుల పట్లకూడా అలాంటి శ్రద్ధ, అభిమానం, మమత పెంచుకో. అంటే – అన్ని జీవుల కష్టసుఖాలు నీ కష్టసుఖాలుగా భావించుకో. నీ సుఖం కోసం, నీ స్వార్థం కోసం నీవు ఇతరులకు అన్యాయం చేయకు. అన్ని జీవులపట్ల ప్రేమను పెంచుకొన్న వాడే నిండు మనస్సు ఉన్నవాడు. నిండు మనస్సు లేనివాడు మంచి నాయకుడు కాలేదు. మంచి మనిషి కాలేదు. ఇది మన భారతీయుల సంస్కృతిలోని గొప్ప విషయం. గాంధీ మహాత్ముడు ఈలాంటి నిండు మనస్సు ఉన్నవాడు.

ఒకసారి ఆయన ఒక బడికి వెళ్లినాడు. ఆ బడిపిల్లలతో కలిసిపోయినాడు. పిల్లలంటే గాంధీతాతకు చాలా ఇష్టం మరి. ఒక పిల్లవాడు ఆయనతో "తాతయ్యా! నీకు చొక్కాలు లేవా? ఇలా ఎందుకుంటావు మరి? మా అమ్మ నడిగి నీకు చొక్కా కుట్టిస్తాను" అన్నాడు అమాయకంగా. అప్పుడు తాతయ్య "నాకు ఒక్క చొక్కా చాలదు" అన్నాడు.

"మరెన్ని కావాలి?"

"చాలా కావాలి. నాకు ఒక్కడికే కాదు. నాకు నలభైకోట్ల సోదరులు ఉన్నారు. మరి ఇంత మందికి మీ అమ్మ చొక్కాలు కుట్టిస్తుందా?"

పాపం ఆ కుర్రాడికి సరిగ్గా అర్థం కాలేదు. అయినా బడిలోని పంతుళ్లూ అక్కడ తాతయ్యను చూడడానికి వచ్చిన పెద్దలూ అర్థం చేసుకొని, ఆ మహానుభావుని నిండు మనస్సుకు జోహార్లు అర్పించినారు.

✪ ✪ ✪

ఉర్దూభాషలో ఎక్బాల్ అనే ఒక కవి ఉండేవాడు. ఆయనకు సంస్కృతం, పార్సీ, అరబ్బీ, ఇంగ్లీషు భాషల్లో గొప్ప పాండిత్యం ఉండేది. ఆయన వ్రాసిన ఒక గేయంలోని నాలుగు పంక్తులతో మీకు ఇప్పుడు పరిచయం చేస్తాను.

"సారే జహాఁసే అచ్ఛా హిందూస్తాఁ హమారా
హమ్ బుల్ బులేఁహైఁ ఇస్‌కీ యే గుల్‌సితాఁ హమారా
యూనానొ మిశ్రీరోమా సబ్‌మిట్‌గయే జహాఁసే
అబ్‌తక్ మగర్‌హై బాకీ నామో నిషాఁ హమారా"

మన భారతదేశం ప్రపంచంలో కల్లా మంచిది. ఈ దేశం ఒక తోట. మనమంతా కోయిలలం. గ్రీసు, రోమ్, ఈజిప్టు నాగరికతలన్నీ ఒకనాడు చాలా గొప్పవి. అవి ఇప్పుడు పేరుకు కూడా లేవు. కాని మన భారతదేశం ఇప్పటికీ తన ఉత్తమ ఆదర్శాలతో నాగరికతతో అలరారుతున్నది - అని ఈ ఉర్దూ పంక్తులకు అర్థం.

మన భారతదేశం ఎందుకు తన నాగరికతనూ సంస్కృతినీ కాపాడుకుంటున్నది? గాంధీమహాత్ముడు, లాల్‌బహదూర్‌శాస్త్రి వంటి మహానుభావులను ప్రపంచానికి ఎలా అందించగలుగుతున్నది? అంటే మన జాతి పెద్దల అడుగుజాడల్లో నడుస్తున్నందుకు. ఇప్పటి తరాలకు జాడ చూపినవారు గాంధీ, నెహ్రూ, లాల్ బహదూర్‌శాస్త్రి, తిలక్, విరేశలింగం ఇంకా మరెందరో. వీళ్ల అడుగుజాడల్లో నడిచే దేశానికి ఎప్పటికీ జయమే. నిత్యకళ్యాణం పచ్చతోరణమే.

చాలాకాలం క్రింద గ్రీసు దేశంలో ఒక బుద్ధిమంతుడు ఉండేవాడు. ఆయన రకరకాల ప్రశ్నలడిగి తన ప్రశ్నలకు జవాబు చెప్పలేనివాళ్ళకు జ్ఞానాన్ని బోధించేవాడు. ఆయన పేరు సోక్రటీసు. సత్యాన్ని ప్రజలు తెలుసుకోవాలని ఆయన ఎంతో ప్రయత్నం చేసినాడు. అయితే అప్పటి రాజులకు ఆయన ప్రచారం గిట్టలేదు. ప్రజలు ఎదురు తిరిగి తమ అధికారాన్ని కూల్చివేస్తారేమో అని భయపడి అధికారులు అతనికి మరణశిక్ష విధించి,

విషం త్రాగించి అతనిని చంపివేసినారు. అయితే ఇంతవరకు ప్రపంచంలో పుట్టిన పెద్ద పెద్ద బుద్ధిమంతులలో వివేకవంతులలో సోక్రటీసు ఒకడుగా అందరికీ తెలుసు. అంత జ్ఞానం ఉండి కూడా ఆయన "నాకు తెలియదనే సంగతి నాకు బాగా తెలుసు" అని అంటుండేవాడు. అంత తెలిసినవాడే అలా అంటున్నప్పుడు కొంత తెలిసినవాడు చాలా పదిలంగా మాట్లాడవలసి ఉంటుంది. మనకు ఏదైనా విషయం తెలియక పోతే తెలుసుకునేందుకు ప్రయత్నం చేయాలి. స్వయంగా చదివి మనకంటె ఎక్కువ జ్ఞానం, అనుభవం కలిగిన వాళ్ళను అడిగి తెలుసుకోవాలి. అంతేకాని తెలియనిదానిని తెలుసుననుకోవడం తెలివిలేనితనం. దీనివల్ల ముందు మనకూ తరువాత దేశానికీ నష్టం కలుగుతుంది. అందుకే కష్టపడి చదువుకొని మనకు తెలిసింది సత్యం అన్న నమ్మకం కుదిరిన తరువాతనే మనం ఏదైనా అనాలి. ఏదైనా చెయ్యాలి. అప్పటికప్పుడు ఏదో పని పూర్తి చేసుకోవడానికి మనకు తెలియకపోయినా ఒకరిని చూసి కాపీ కొట్టటం వల్ల మనకు అప్పటికి లాభం కనపడుతుందేమో కాని, ఎప్పుడో ఈ కాపీకొట్టే గుణం మనలను సొంత ఆలోచనలు లేనివాళ్ళుగానూ, గుడ్డిగా నమ్మేవాళ్లుగానూ తయారుచేస్తుంది. ఈ సందర్భంగా గాంధీమహాత్ముని జీవితంలోని ఒక చిన్న సంగతి మీకు చెపుతాను.

గాంధీ హైస్కూలు తరగతుల్లో చదువుకొనే రోజుల్లో జరిగిన కథ. గాంధీ ఉన్న తరగతిలోకి జెయిల్స్ అనే ఒక అధికారి వచ్చి ఇంగ్లీషు మాటలు అయిదు వ్రాయమన్నాడు. వాటిలో 'Kettle' అనే మాట తప్ప గాంధీ అన్నీ సరిగ్గా వ్రాసినాడు. తరగతిలోని టీచరు ఆ అధికారికి కనపడకుండా గాంధీని కాలుతో పొడిచినాడు. ఎందుకు పొడిచినాడో గాంధీకి తెలియదు. గాంధీ తప్ప అందరూ చక్కగా వ్రాసినారని తెలుసుకొని ఆ అధికారి వెళ్ళిపోయినాడు. అప్పుడు ఆ టీచరు – "నేను నీ కాలును తట్టి ముందున్న పిల్లవాని వ్రాతను చూసి దిద్దుకొమ్మంటిని. నీకు అర్థం కాలేదు" – అని గాంధీని మందలించెను. తనకు తెలియనిది ముందున్న పిల్లవాని కాపీలో చూసి వ్రాయడం తప్పని గాంధీకి తెలుసు. ఆ మాటే టీచరుతో అన్నాడు. అయినా ఆ టీచరంటే గాంధీకి గౌరవమే. పెద్దలు చేసిన తప్పులను ఎత్తిచూపడంలో గొప్పతనంలేదు. తప్పు అని తెలిసినప్పుడు చేయకుండడమే గొప్పతనం. చిన్నప్పటి నుంచి ఈ అలవాటు చేసుకున్న గాంధీ పెరిగి పెద్దవాడై దేశంలో అందరికీ పూజనీయుడైనాడు. కాపీకొట్టడం బుద్ధిలేని తనాన్ని తెలియజేస్తుంది. తెలుసుకోవాలనే కోరికను చంపేస్తుంది. ఇతరుల చేతిలో కీలుబొమ్మలను చేస్తుంది. చిన్ననాడే ఈ విషయం తెలుసుకున్న గాంధీ టీచరు చెప్పినా వినక తనకు తోచిన మంచి మార్గంలోనే నడిచి తాను నడిచిన బాట అందరూ నడువదగినదని తెలియజేసినాడు.

గాంధీ మహాత్ముడు భారత దేశంలోనూ ఇంగ్లండులోనూ చదువుకొన్నాడు. ఆయన ప్రజా జీవితం మన దేశంలో కాక దక్షిణాఫ్రికాలో ప్రారంభమయినది. ఈ శతాబ్దం తొలిదినాల్లో దక్షిణాఫ్రికాలో చాలా మంది భారతీయులుండేవారు. కొందరికి అక్కడ వ్యాపారం ఉండేది. కొందరు కూలీలుగా బ్రతికేవారు. అక్కడ కూడా అధికారం బ్రిటిషువారిదే. ఈ

బ్రిటిషువాళ్ళు అధికార గర్వంతో మన భారతీయులను ఎన్నో కష్టాలు పెట్టేవాళ్లు. తాము ఎక్కే జట్కా బండ్లల్లో భారతీయులను ఎక్కనిచ్చేవాళ్లు కాదు. రైలు బండ్లల్లో తమకోసం ప్రత్యేకంగా పెట్టెలుండేవి. తమకున్న సౌకర్యాలూ గౌరవ మర్యాదలూ భారతీయులకు ఉండకూడదనీ, వాళ్లు తమకంటె తక్కువ రకం మనుష్యులనీ అనుకునేవాళ్లు. దక్షిణాఫ్రికా కోర్టులో అబ్దుల్లా అనే ఒక వ్యాపారికి వకీలుగా ఉండడానికి ఒప్పుకొని, గాంధీ దక్షిణాఫ్రికాకు పోయినాడు. అక్కడ న్యాయవాదిగా తన పనిని మొదలు పెట్టినాడు. ఆయన తన పని చూచుకుంటూనే తన భారతీయులు ఎదుర్కొంటున్న కష్టాలను తెలుసుకునే ప్రయత్నం చేసినాడు. వాళ్ళనంతా ఒకటిచేసి అక్కడి ప్రభుత్వానికి విరుద్ధంగా హక్కుల కోసం ఉద్యమం ప్రారంభించినాడు. ఒక ఆశ్రమం కూడా స్థాపించి మంచి నడవడివల్ల, సత్యం మీద ఉండే నమ్మకంవల్ల బ్రిటిషు రాజ్యాన్ని ఎదుర్కోవాలని, అతడు వాళ్ళకు ఏమాత్రం నష్టం కలిగించకుండా ఒక కొత్త రకం పోరాటాన్ని ప్రారంభించినాడు. ఆ పోరాటం పేరు 'సత్యాగ్రహం' 'సత్యాగ్రహం' అంటే సత్యం కోసం పట్టుదల. సత్యం కోసం పోరాటం. అయితే ఈ పోరాటంలో ఎదుటివాడికి నచ్చచెప్పడం ఎదుటివాడు కూడా మనవాడేనన్న భావంతో ప్రవర్తించడం ముఖ్యం. ఈ సత్యాగ్రహాన్ని ఆయన అక్కడ ఆరంభించి భారతీయులనంతా ఒక్కటి చేసినాడు. తానూ కష్టాల పాలైనాడు. అందరి ప్రేమకూ అందరి ఆదరానికీ పాత్రుడైనాడు. అక్కడి భారతీయులకు ఒక శక్తిని సంపాదించి యిచ్చినాడు.

కొంత కాలం తర్వాత గాంధీ భారతదేశానికి తిరిగి రావాలని నిశ్చయించుకొన్నాడు. అక్కడి వాళ్లంతా "మమ్మల్ని విడిచి వెళ్ళొద్దు. నీవు మాకు నాయకుడవు. నీవు పోతే మాకు దిక్కెవ్వరు? ఇక్కడే ఉండండి" అని మొర పెట్టుకున్నారు. కానీ అవసరమైతే తిరిగి వస్తానని గాంధీ వాళ్ళను ఒప్పించినాడు.

ఊరూరా వీడ్కోలు సభలు జరిగినవి. గాంధీకి విలువైన కానుకలిచ్చినారు. బంగారు వెండి నగలూ రత్నాలు పొదగిన నగలూ ఎన్నో ఇచ్చుకున్నారు. తాను చేసిన సేవకు ఫలితంగా ఈ కానుకలను తీసుకోవడం తప్పు అనుకున్నాడు గాంధీ. వీటిని తిరిగి ప్రజలకు ఇచ్చివేస్తే తనకు చింత ఉండదని భావించి ఆ కానుకలన్నింటినీ బ్యాంకులో పెట్టి, స్థానికులైనకొందరు పెద్దలను ధర్మకర్తలుగా నియమించి, తాను కుటుంబంతో భారతదేశానికి తిరిగి వచ్చినాడు గాంధీ.

ప్రజలకు సేవ చేయాలనుకునే వాడు వాళ్ళనుండి విలువైన కానుకలను ఆశించకూడదు అని గాంధీ తన జీవితంలో నిరూపించినాడు. అందుకే ఆయన ఆదర్శ పురుషుడు. ఆయన పేరు చెప్పుకొని, ఆయనను మహాత్ముడని ఆయన సందేశం ప్రకారం దేశం నడచుకోవాలని చెప్పే వాళ్ళందరూ ఈ సంగతిని జాగ్రత్తగా తెలుసుకోవాలి.

ప్రజలకూ దేశానికీ సేవచేస్తే కలిగే తృప్తి చాలా గొప్పది. అదే సంపద. అలాంటి సంపదను నమ్ముకొని అనుభవించే నాయకుని అడుగుజాడల్లో దేశంలోని ప్రజలు నడవడానికి ఎప్పటికీ సిద్ధంగా ఉంటారు.

వెలుగు బాటలు

మనిషికి పశువుకూ ఏమిటి భేదం? రెండూ ప్రాణులే. కాని మనిషి పశువులా ప్రవర్తిస్తున్నాడు. అంటే మనకు బాధ కలుగుతుంది. పశువుల నుంచి మనుషులను వేరుచేసేది భాష. పశువులకు కూడా భాష ఉంటుంది. కానీ అది చాలా పరిమితమైంది. కొన్ని లక్షల ఏండ్ల క్రింద ఆ పశువుల అరుపులు ఎలా ఉండేవో ఇప్పటికీ అలాగే ఉన్నాయి. ఆ పశువుల ఆలోచనల్లో, తిరిగే తీరులో, తినే తీరులో ఉండే తీరులో అవి తమంతటతాముగా ఏ మార్పూ చేసుకోలేకపోయినాయి. తమ అనుభవాలను వచ్చే తరాలకు చెప్పలేకపోయినాయి. తమకు కలిగిన కష్టాలనూ, సుఖాలనూ అవి రకరకాలుగా చెప్పుకోలేవు. మనస్సుల్లోని మాటను దాచుకుని పైకి మరో మాటను చెప్పలేవు. కాని మనిషి భాషను సృష్టించుకొని ఇవన్నీ చేసుకోగలిగినాడు. అయితే మనిషి పుట్టించి పెంచిన ఈ భాష రానూ రానూ రెండు రకాలయింది. ఇంచుమించు అన్ని నాగరిక భాషలు రెండు రకాలుగా ఉంటాయి. ఒకటి అవసరానికి పనికివచ్చేది. లోకంలో మనిషి తన బ్రతుకును చాలా మందికి దారి చూపేదిగా చేసుకోవాలన్నా, తన మాటను చాలా మంది వినాలన్నా తన మాటల్లో తనవాళ్ల బ్రతుకు బరువులూ, కష్టసుఖాలూ అందరి మనసులకు అందేటట్టు ఉండాలన్నా రెండో రకం భాషను నేర్చుకోవాలి. చక్కగా చదువుకుంటేనే అది వస్తుంది. ఎన్నో పుస్తకాలు చదువుకుంటేనే అనేక విషయాలు తెలుస్తాయి. ఎందరో మంచివాళ్లతో స్నేహంచేస్తేనే మంచి భాష వస్తుంది. మంచి ఆలోచనలు వస్తాయి. చక్కగా చదువుకోకపోతే తాను దేశానికి ఏం చేయాలో ఎట్లా చేయాలో మనిషికి తెలియదు. చిన్నతనంలోనే బాగా చదువుకునేందుకు అవకాశం ఉంటుంది. అలాంటి అవకాశం లేకపోతే దేశంలోని పెద్దలూ, ప్రభుత్వమూ అలాంటి అవకాశాలు ఎక్కువ చేయాలి. మొక్క చిన్నగా ఉన్నప్పుడే దాన్ని చక్కగా పోషిస్తే అది పెద్దదై మంచి పండ్లను అందిస్తుంది. మనకు మంచి భాషనూ మంచి ఆలోచనలను ఇయ్యగలిగే శక్తి పుస్తకాలకు ఉంటుంది. పుస్తకం పూజింపదగిన వస్తువుల్లో ఒక్కటీ. కాలుకు కాగితం తగిలితే ఆ కాగితాన్ని మొక్కేవాళ్లను మీరు చూసేఉంటారు. పిల్లలు లేని ఇల్లు ఎంత బోసిగా ఉంటుందో పుస్తకాలు లేని ఇల్లు కూడా అంతే వట్టిపోయి ఉంటుంది. చాలాకాలం కింద ఇంగ్లాండులో మిల్టన్ అనే పెద్దకవి ఉండేవాడు. ఆయన ఒక మహాత్ముని జీవితరక్తమే ఒక మంచి పుస్తకం అని పుస్తకాన్ని గురించి ఒక మాట అన్నాడు. అంటే ఒక మహానుభావుడు తన జీవితంలోని అనుభవాలను వడబోసి ఒక పుస్తకం వ్రాస్తాడు. అది జాతికి దీపం అవుతుంది. మనిషికి బాట అవుతుంది. బుద్ధికి తోడవుతుంది. బ్రతుకంతా మనతో కలిసివుండే వస్తువుల్లో పుస్తకం ముఖ్యమైంది.

తాను బ్రతికి వున్నంతకాలం పుస్తకంతో నేస్తం కట్టిన పెద్ద మనిషి కథ మీకు చెపుతాను. ఆయన పేరు తలపునకు రాగానే గర్వంతో తల ఎత్తని భారతీయుడుండడు.

ఆయన చేసిన పనులు కనపడగానే కృతజ్ఞతలు తెలుపుకోలేని భారతీయుడుండడు. స్వతంత్ర భారతదేశం ఆయనకు అన్నిటికంటె పెద్ద బిరుదు అంటే 'భారతరత్న' ఇచ్చి గౌరవించింది. మంచి నడవడి కలవాడుగా మంచి పరిపాలకుడుగా మంచి ఇంజనీయరుగా మంచి దేశభక్తుడుగా దూరదృష్టికల బుద్ధిమంతుడుగా ఆయన మన భారతదేశ చరిత్రలో ఎప్పటికీ ఉంటాడు. కొండలున్నంతకాలం ఉంటాడు. సముద్రాలున్నంతకాలం ఉంటాడు. గంగా కావేరీ నదులు గలగలా పారుతున్నంత కాలం ఉంటాడు. ఆయన పేరు తెలియని భారతీయుడు ఉండకూడదు. పెద్ద పెద్ద నదులకు కట్టిన ఆనకట్టలను చూస్తే ఆయన పేరు గుర్తుకు వస్తుంది. మన ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాదు నగరంలోని లక్షలాది ప్రజలకు మంచినీళ్ళను అందిస్తున్న ఉస్మాన్‌సాగర్ (గండిపేట) చెరువును చూస్తే ఆయన జ్ఞాపకానికి వస్తాడు. మైసూర్‌నగరం సమీపంలో విద్యుద్దీపాల వెల్గులతోట, రంగు రంగుల వెలుగునీటి కాల్వల అందాల బృందావనం ఆయన కీర్తిని మనముందు నిలుపుతుంది. మహారాష్ట్రలోని పూనానగరం దగ్గర ఉన్న ఖడక్‌వాస్లా ఆనకట్ట ఆయన గొప్పతనాన్ని చాటుతున్నది. ఇట్లా ఆయన సాధించిన వాటిలో కొన్ని మాత్రమే నేను ఇప్పుడు చెప్పగలుగుతున్నాను. మనకు స్వాతంత్ర్యం రాకముందే మోటారుకార్లను మన దేశంలోనే తయారు చేసే పథకాన్ని ఆయన రూపొందించినాడు. కాని అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఆయన ప్రయత్నాన్ని కొనసాగనీయలేదు. అన్ని నష్టాలకూ మూలమైన పేదరికం తనంతట తానే మనిషికి వచ్చేది కాదనీ, ప్రయత్నం వల్ల దాన్ని ఎదుర్కొని సుఖంగా బ్రతుకవచ్చునని నమ్మి ఆ మహానుభావుడు జీవితమంతా జాతికి వెలుగుబాట చూపిస్తూ మంచిపనులు చేసినాడు. మంచి సలహాలను ఇచ్చినాడు. మంచి ఆలోచనలను పంచి పెట్టినాడు. ఆయన నూరేండ్లకు పైగా బ్రతికినాడు. మంచి మంచి పుస్తకాలు వ్రాసినాడు. ఆయనను గూర్చి మీరు పెద్ద వాళ్ళయ్యాక ఎన్నో విషయాలు తెలుసుకుంటారు. ఇప్పుడు మాత్రం ఆయన జీవితానికి సంబంధించినన ఒకటి రెండు సంగతులు మీకు చెపుతాను.

చదువుకోవడానికి అవకాశాల మాట ఎలా ఉన్నా చదువుకోవాలనే కోరిక మనిషికి చాలా అవసరం. ఈ కోరిక ఎంత పెద్దదయితే ప్రయత్నం అంత సులభమవుతుంది. ఈ దేశం నాది. ఈ దేశంలోని ప్రజలకు నేను సేవ చేయాలి. అందుకు తగిన శక్తిని సంపాదించుకోవాలి. అన్న ఆరాటం ఉండాలి కాని అవకాశాలకేం తక్కువ. అన్ని అవకాశాలున్నా ఉపయోగించుకోలేని వాళ్ళను మనం చూడడం లేదా!

నేను మీకిప్పుడు చెపుతున్న పెద్ద మనిషి పేద కుటుంబంలో పుట్టినాడు. చదువుకోవాలనుకునే పేదవాళ్ళకు ఎన్ని కష్టాలు ఎదురౌతాయో అన్ని కష్టాలూ అతనికీ ఎదురైనవి. కాని ఆయన కష్టాలను లెక్కచేయక శ్రద్ధతో చదువుకున్నాడు. గొప్పవాడైనాడు. భారతీయులకందరికీ పూజనీయుడైనాడు. ఆయన పేరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య.

విశ్వేశ్వరయ్య ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నప్పుడు అతని నడవడిక క్రమశిక్షణకూ చదువుమీది శ్రద్ధకూ అధ్యాపకులు సంతోషించి తమ ఇండ్లకు పిలిచి ఎన్నో

మంచి పుస్తకాలను అతనిచేత చదివించి అతని మెదడుకు పదును పెట్టినారు. " ఈ పుస్తకాలన్నీ నేనెందుకు చదవాలి? ఇవి కోర్సులో లేవుగా, బడిలోనూ చదువూ ఇంటిలోనూ, చదువేనా?, ఆడుకునేదెప్పుడు?" వంటి ప్రశ్నలు వేయక టీచర్లు చెప్పినట్టు చేసినాడు. దానితో అతనికి చిన్నతనంలోనే ఎంతో జ్ఞానం అబ్బింది. కళాశాలలో చదువుకుంటున్నప్పుడు నిత్యజీవితమే అతనికి దినదినగండంగా ఉండేది. అంత పెద్ద చదువులకు తగిన హంగులు ఇంటివద్దలేవు. ఒక గృహస్థుని ఇంటిలో రాత్రిపడుకొని తెల్లవారుజామునలేచి అతని పిల్లలకు చదువులు చెప్పి తన చదువుకు కావలసిన డబ్బును సంపాదించుకున్నాడు. కాని కాలేజీకి మాత్రం సరియైన వేళకే పోయేవాడు. గణితంలో అతనికున్న తెలివిని చూసి ప్రిన్సిపాలు ఎంతో సంతోషించినాడు. తన పనిని సరియైన వేళకు పూర్తిచేయడంలోనూ, తాను సంపాదించుకున్న జ్ఞానాన్ని ఇతరులకు అర్థమయ్యేతీరుగా వివరించడంలోనూ అతడు చూపిన మెలకువలకు ప్రిన్సిపాలు హృదయం ఎంతో పొంగిపోయింది. 'వెబ్‌స్టర్' డిక్షనరీని అంటే నిఘంటువును బహుమతిగా ఇచ్చి దీవించినాడు. జీవితకాలమంతా పనికివచ్చే పుస్తకాలలో నిఘంటువు ఒకటి. చదువుకున్న వానివద్ద నిఘంటువు లేదంటే వాడు మాటల పేదరికంతో బాధపడుతున్నాడన్న మాట. మరి విశ్వేశ్వరయ్య ఆ నిఘంటువును బ్రతికినంతకాలం పదిలంగా ఒక పవిత్రమైన వస్తువుగా చూసుకున్నాడు. అందుకే చదువుకొమ్మని మనకెవరైనా పుస్తకం ఇస్తే మనం అతనిపట్ల ఎంతో ఆదరంగా ప్రవర్తించాలి. ఒక దీపం నుంచి మరో దీపం ఎలా వెలుగుతుందో ఒక పుస్తకం నుంచి ఒక మనస్సు వెలుగుతుంది. పుస్తకాలు ఎందరి బ్రతుకులనో మార్చివేసినాయి. మన భారతీయుల దృష్టిలో పుస్తకం సరస్వతీదేవికి ప్రతి రూపం. ఆమె చదువుల తల్లిగదా మరి! ఆశ్వయుజ శుద్ధ సప్తమినాడు మన ఇండ్లలో పుస్తకాలకు పూజచేస్తారు. విశ్వేశ్వరయ్యకు ఆ పుస్తకాన్ని చూసినప్పుడల్లా ఉత్తేజం కలిగేది.

పిల్లలకూ విశ్వేశ్వరయ్యకూ సంబంధించిన మరో సంగతి చెపుతా.

ఎక్కడైనా గానీ ఎవరిముందైనాగానీ ఆలోచించకుండా, బాధ్యత లేకుండా మాట్లాడకూడదు. ముఖ్యంగా ఉపన్యాసం ఇయ్యవలసి వచ్చినప్పుడు ముందుగా ఆలోచించుకొని మాట్లాడడం సభ్యత అనిపించికుంటుంది. విజ్ఞత అనిపించుకుంటుంది.

విశ్వేశ్వరయ్య మైసూరు సంస్థానానికి దీవానుగా అంటే మహామంత్రిగా ఉండేవారు. ఒకసారి ఏదో పనిమీద చాలాదూరం వెళ్ళవలసివచ్చింది. ఒక చిన్న పల్లెటూరువద్ద ఆయన కారు చెడిపోయింది. డ్రైవరు బెంగుళూరికి పోయి మరొక కారు తీసుకువచ్చేవరకు ఆయన అక్కడే ఉండిపోవలసివచ్చింది. అప్పటి రాకపోకల పరిస్థితులు అలాంటివి. ఈ సంగతి తెలిసి ఆ ఊరిలోని బడిపంతులు ఆయనను బడికి వచ్చి విశ్రాంతి తీసుకొని పిల్లలకు నాలుగు మాటలు చెప్పి దీవించిపొమ్మని వేడుకున్నాడు. ఆయన అందుకు ఒప్పుకొని బడికిపోయి కొంతసేపు మాట్లాడినాడు. కాని ఎందుకో ఆయనకు తృప్తి కలుగలేదు. తాను అనువైన పద్ధతిలో మాట్లాడలేదేమో అని అనుకున్నాడు. పిల్లలతో అన్నాడు కదా మరెప్పుడైనా మీ బడికి వస్తాను. ఏం మాట్లాడాలో ఆలోచించుకొని వస్తాను. అని చెప్పి వెళ్ళిపోయినాడు.

కొన్నాళ్ళ తరువాత మిఠాయిలతో పండ్లతో ఆ ఊరి బడికివచ్చి మిఠాయీలనూ పండ్లనూ పిల్లలకు పంచిపెట్టి చక్కని ఉపన్యాసమును చేసినాడు. నిజానికి పిల్లలతో మాట్లాడడానికి ఇంత శ్రద్ధ అవసరమా? పెద్దలమనుకునే వాళ్ళకు ఇది అవసరమే. ఇలాంటి పెద్దలకు పెత్తనం వస్తే పిల్లలకేకాదు దేశానికంతా మేలు కలుగుతుంది.

సోమరితనం వల్ల లాభం ఉండదు. సాధ్యమైనంత వరకు కోరికలను తగ్గించుకోవాలి. ఆదాయానికి మించిన ఖర్చుచేయడం తెలివి లేని పని. ఒళ్లువంచి పనిచేస్తేనే పేదతనం పారిపోతుంది. విద్యార్థిగా ఉన్న కాలంలోనే చదువుకోవడానికీ తెలిసికోవడానికీ ఎక్కువ అవకాశాలుంటాయి. కనుక చదువుకు సంబంధించని పనులలో మనస్సును చొప్పించక పోవడం మంచిది. ఇంకా ఇలాంటి ఎన్నో మంచి సలహాలను అతడు మనకు ఇచ్చి వెలుగు బాట చూపిపోయినాడు.

మీరెప్పుడైనా హైదరాబాదు నగరానికి వస్తే ఖైరతాబాద్‌లో ఉన్న ఆయన కంచు విగ్రహాన్ని చూడండి. మీ పెద్దల నడిగి ఆయనను గురించి ఇంకా ఎన్నో విషయాలను తెలుసుకునే ప్రయత్నం చెయ్యండి.

చదువు ఒక్కటే కాదు మనిషికి కావలసింది. దాని వల్ల వచ్చే తెలివి తేటలు కూడా మంచి నడవడిక లేనప్పుడు పనికిరానివే అవుతాయి. దక్షిణ భారతదేశంలో ఇటీవలి చరిత్రలో ఇద్దరు మహాపురుషులు మన దేశానికి గొప్ప పేరు తెచ్చినారు. నిన్నటి తరాన్ని నడిపించినారు. గొప్ప సంస్కర్తలుగా మనలో నిలిచి పోయినారు. ఒకరు వీరేశలింగం పంతులు మరొకరు రఘుపతి వేంకట రత్నం నాయుడు. నాయుడుగారు బడిలో చదువుకుంటున్నప్పుడు ఎదో ఒక పుస్తకంలో రాజారామమోహనరాయలను గూర్చి కొంత చదివినారట. రామమోహనరాయలు భారతదేశ ప్రజలలో వేళ్లు పాతుకు పోయిన గుడ్డి నమ్మకాలను పెకలించి వేయడానికి పెద్ద ప్రయత్నం చేసినారు. స్త్రీలకు విద్య చెప్పించడం, కులాల కట్టుబాట్లను తెంచివేయడం, భర్త చనిపోతే అతని శవంతోపాటు బ్రతికివున్న భార్యను కూడా కాష్ఠంలో వేసి కాల్చిచంపడం లాంటి దురాచారాన్ని నిలిపివేయడం, మతం పేరుతో సంప్రదాయం పేరుతో దిక్కులేని వాళ్లను అన్యాయాల పాలు చేసేవాళ్ళ ఆటకట్టించడం, అందరూ చదువుకోవాలని ప్రచారం చేయుడం వంటి మంచి పనులు ఎన్నో రామమోహనరాయలు చేసి భారతదేశం ప్రజలను కొత్త కాలానికి అనుకూలంగా నడచుకునేటట్లు చేసినారు. ఇంతటి మహానుభావుణ్ని గూర్చి ఇంకా ఎంతో తెలుసుకోవాలని నాయుడు టీచరును అడిగినాడు. మరెన్నో పుస్తకాలను టీచరు సహాయంతో చదివి అర్థం చేసుకున్నాడు. పెరిగి పెద్దవాడైనాడు. ఎందరో పేద విద్యార్థులను దగ్గరకు తీసుకుని వాళ్లకు విద్యాబుద్ధులు చెప్పించినాడు. గొప్ప అధ్యాపకుడుగా గొప్ప సంస్కర్తగా గొప్ప విద్యావేత్తగా గొప్ప వక్తగా ఆయన ఎన్నో పదవులను చేపట్టి అందరి మన్ననలను పొందినాడు.

"విజ్ఞానము, శీలము - ఈ రెండు విషయములలో నా జీవితము యువకులకు అనుకరణీయమగునట్లు బ్రతుకవలెనని నా ఆశయము" అని ఆయన చెప్పుకుంటూ

వుండేవాడు. ఎందరి బ్రతుకులనో ఆయన తీర్చిదిద్దినాడు. ఎందరో పేద విద్యార్థులను ఆదుకున్నాడు. చదువుకోవాలనే కోరిక ఉన్న పిల్లలను చూస్తే ఆయనకు ఎంతో సంతోషం కలిగేది. చదువుపట్ల ఆదరం ఉన్న పిల్లలను ఆదుకుంటేనే వాళ్ళు బాగుపడతారు. లేకుంటే కలిగించిన సౌకర్యాలను దుర్వినియోగం చేసుకుంటారు. నిజమైన విద్యావేత్త నాయుడు గారికీ సంగతి బాగా తెలుసు. తెలుగు దేశంలోని గొప్ప గొప్ప కవులు, గొప్ప గొప్ప పరిపాలకులు గొప్ప గొప్ప నాయకులు అతని శిష్యులమని చెప్పుకొని గర్వపడుతుంటారు. తెలుగులో పేరుమోసిన పెద్ద కవి దేవులపల్లి కృష్ణ శాస్త్రి ఆయన శిష్యుడని మీకు తెలుసా?

పుస్తకం చదివి ఇంకా తెలుసుకోవాలనే ఉత్సాహంతో మరిన్ని పుస్తకాలు చదివి, తెలుసుకోవడంతోనే ఆగకుండా ఆ పుస్తకాలలోని ఆలోచనలకు అనుకూలంగా తన బ్రతుకును మలచుకొని దేశ ప్రజలను మలచిన మహాపురుషుడు రఘుపతి వేంకటరత్నం నాయుడు. ఆయన వ్రాసిన పుస్తకాలను పెద్దవాళ్ల సహాయంతో చదవండి.

మనం భారతీయులం. భారతదేశంలో పుట్టిన వాళ్లమన్న మాట. ఈ దేశంలోని ప్రజల ఆచారాలనూ ఆలోచనలనూ అర్థం చేసుకోవాలంటే మనం కొన్ని పుస్తకాలు తప్పకుండ చదువుకోవాలి. మీరు పెరిగి పెద్ద వాళ్లయిన తరువాత ఆ పుస్తకాలను చదివి జ్ఞానం సంపాదించుకోండి. వాటిలో మూడు పుస్తకాలు మాత్రం అందరూ చదువదగినవి. ఒకటి వాల్మీకి వ్రాసిన రామాయణం. రెండవది వ్యాసుడు వ్రాసిన మహాభారతం. మూడవది ఆ వ్యాసుడే వ్రాసిన మహాభాగవతం. వాల్మీకి, వ్యాసుడు ఈ పుస్తకాలను సంస్కృతభాషలో వ్రాసినారు. అయినా అన్ని దేశ భాషల్లోనూ ప్రపంచంలోని గొప్ప భాషల్లోనూ ఈ పుస్తకాల అనువాదాలు మనకు దొరుకుతాయి. పిల్లలు చదువుకునేందుకు అనుకూలంగానూ పెద్దలకు ఉపయోగపడే పద్ధతిలోనూ ఇవి దొరుకుతాయి. ఈ మూడు పుస్తకాల్లోని కథలనూ నీతులనూ ధర్మాలనూ తెలుసుకుంటే భారతదేశంలోనే కాదు. ప్రపంచంలో తెలుసుకోవలసిన విషయాలు అన్నీ తెలుస్తాయి. ఒక పెద్ద మనిషి అన్నాడు – "యన్న భారతే తన్న భారతే" అని. అంటే "ఏది మహాభారతంలో లేదో అది భారతదేశంలోనే లేదు" అని అర్థం. రామాయణం మన భారతదేశంలో పుట్టిన మొదటి కావ్యం, అది చదువని వాడు నిజంగా ఏమీ చదువనివాడే. రామాయణం, భారతం, భాగవతంలోని కథలు చదివితే ఈ దేశానికి సేవచేసే మనిషి ఎట్లా ఉండాలో తెలుస్తుంది. ఎట్లా మాట్లాడాలో తెలుస్తుంది. ఎట్లా బ్రతుకాలో తెలుస్తుంది. ఈ పుస్తకాలలో ఎందరో గొప్పవాళ్లు మనకు కనపిస్తారు. శ్రీరాముడు, విశ్వామిత్రుడు, సీత, శబరి, ఆంజనేయుడు, భరతుడు, లక్ష్మణుడు, వశిష్ఠుడు, శ్రీకృష్ణుడు, భీష్ముడు, ధర్మరాజు, అర్జునుడు, ఏకలవ్యుడు, అభిమన్యుడు, కర్ణుడు, ధర్మవ్యాధుడు, సావిత్రి, దమయంతి, ప్రహ్లాదుడు, శిబి, అంబరీషుడు, నారదుడు, ధ్రువుడు, కుచేలుడు, యశోద, రుక్మిణి, అనసూయ, లాంటి వాళ్లు సత్యంకోసం ధర్మంకోసం ఎన్ని పాట్లు పడ్డారో మనకు తెలుస్తుంది. ఈ కథలు చదువుతుంటే మనకు ఉత్సాహం కూడా కలుగుతుంది. మీరు పెద్దవాళ్లయ్యాక ఇవి ఒట్టి కథలే కావనీ వీటి వెనక ఎంతో పెద్ద అర్థం దాగివుందనీ తెలుసుకుంటారు. తరచుగా

మన పెద్దలు చెప్పే మంచి మాటలన్నీ చాలావరకు ఈ మూడు పుస్తకాల పాదుల్లోంచి పుట్టినవే. 'ధన మూల మిదం జగత్' అంటే – ఈ జగత్తుకు ధనమే మూలం, 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ.' అంటే స్వర్గం కంటె కన్నతల్లి, జన్మభూమి గొప్పది. ఇలాంటి మంచి మాటలను సూక్తులంటారు. ఈ సూక్తులకంతా గనులవంటివి ఈ మూడు పుస్తకాలు. స్నేహానికి కలవాళ్లూ లేనివాళ్లూ అనే భేదం ఉండకూడదు. ఎవడైనా కాలం కలసివచ్చి గొప్ప పదవికి వచ్చి నాలుగు రాళ్లు సంపాదించుకునే స్థితికి వస్తే తన చిన్ననాటి స్నేహితులను మరువకూడదు. వాళ్ళకేదన్నా సహాయం చేయగలిగితే తప్పకుండ చేయాలి. మన కలిమి మన బలిమి అవి లేనివాళ్ళకు ఉపయోగపడాలి. పేదలను అసహ్యంగా చూడకూడదు. స్నేహాన్ని గూర్చి ఒక మంచి కథ భాగవతంలో ఉంది. మహాభాగవతం శ్రీకృష్ణుని కథ. శ్రీ కృష్ణుడు భారతీయులకు పూజనీయుడు, పేదల పూరిండ్లల్లో పెరిగి పెద్దవాడై ఆ పేదలను కష్టపెడుతున్న దుర్మార్గులకు ఎదురైనిలిచి వాళ్ళను కాపాడినాడు. తనను పెంచుకున్న యశోదమ్మ, నందుడు బాగా కలవాళ్ళే. అయినా శ్రీకృష్ణుడు తమ కంటె హీనదశలో ఉన్న గోప బాలకులతో అడవులకు గోవులను తోలుకునిపోయి, మేపి ఆ పిల్లవాళ్ళతో కలిసి తన అంతస్తును మరచి, ఆడి, పాడి, చల్దులుతిని మసలినాడు. పెరిగి పెద్దవాడైనాడు. ద్వారకకు రాజైనాడు. పాండవులకు అండగా నిలచినాడు. ఎల్లప్పటికి లోకానికి పనికివచ్చే మంచి సూక్తులను లోకానికి అందించినాడు. ఈ సూక్తులకు 'భగవద్గీత' అని పేరు పెట్టినాడు వ్యాసుడు భారతంలో.

గుండెబలం పెంచుకో.
పనులను సాధించు.
ఫలితం ఎట్లా ఉంటుందో ముందుగానే ఊహించుకొని మురిసిపోకు.
భయపడకు.
ఒకవేళ నీకు ఫలితం దక్కకపోతే నిరాశతో కుంగి పోతావు.
రాక్షసులూ దేవుళ్లూ ఎక్కడో లేరు ఓ మనిషీ వాళ్లు నీ గుండెలోనే ఉన్నారు.
సుఖం కలిగినప్పుడు పొంగిపోకు.
దుఃఖం వచ్చినప్పుడు కుంగిపోకు.

స్వచ్ఛమైన హృదయంతో ఏ మాత్రం స్వార్థం లేకుండా దేవుణ్ని నమ్మినవాడే నిజమైన భక్తుడు.

పని చేయకుండ వుండడం ధర్మంకాదు.
అందరూ పనిచేయాలి.
శ్రమపడి తినేవాడే నిజమైన భక్తుడు.
అన్ని పనులు దేవునికోసం చేయాలి.
దేవుని పేర చేయాలి.
అప్పుడే మనుషులంతా సుఖంగా ఉంటారు.

ఇలాంటివెన్నో మంచిమాటలు భగవద్గీతలో ఉన్నాయి. శ్రీకృష్ణుడు చెప్పటంతో తృప్తి పడలేదు. జీవితంలో ఆయన చేసి చూపించినాడు.

ద్వారకకు రాజైన తరువాత ఆయన జీవితంలో జరిగిన ఒక కథను మీకు చెప్తాను. చెలిమి ఎంత గొప్పదో అది నిలుపుకున్నవాడు ఎంత గొప్పవాడో ఈ కథ చెపుతుంది. ఎప్పటిదో ఈ కథ! కానీ ఇప్పటికీ సరికొత్తగా ఉన్నది. నిజమైన స్నేహం ఎలా ఉంటుందో చెప్పగలుగుతున్నది. సూర్యుడు రోజూ ఉదయిస్తాడు. కానీ మనకు రోజూ కొత్తగానే కనిపిస్తాడు. నేను చెపుతున్న ఈ పుస్తకాల్లోని కథలు కూడా ఇలాంటివే. అవి పాతవే అయినా కొత్తగానే కనిపిస్తాయి. నిజానికి అందమన్నా సత్యమన్నా ఇంతే. మళ్ళీ మళ్ళీ చూడాలని అనిపిస్తుంది. మళ్ళీ మళ్ళీ వెతకాలని అనిపిస్తుంది. " ఈ పాత కథల్లో ఏముంది?" అని పెదవి విరిచేవాళ్ళల్లో నూటికి తొంభైతొమ్మిది పాళ్ళు వీటిని శ్రద్ధగా చదువనివాళ్ళే. శ్రీకృష్ణుని చెలిమి కథ చెపుతానన్నాను కదా! ఇక చదవండి.

శ్రీకృష్ణుడు ద్వారకకు రాజు. ద్వారకలో శ్రీకృష్ణుడు ఉండే భవనం ఎంతో అందంగా ఉండేది. ఎత్తైన కోట గోడలతో సముద్రం ఒడ్డున అందంగా బంగారు శిఖరాలతో మెరుస్తున్న మేరు పర్వతంలా ఉండేది. ఆ నగరంలో అంతా చదువుకున్నవాళ్ళే. పేదవాళ్ళెవరూ లేరు. అందమైన తోటలతో అద్దంలా మెరిసిపోయే రహదారులతో మణులు పొదిగిన గుమ్మాలతో కళకళలాడుతూ ఉండేది. దేవతలు కూడా అప్పుడప్పుడు వచ్చి ఆ నగరాన్ని చూసి సంతోషంతో వెళ్ళిపోతుండేవారు. తాముండే స్వర్గం కంటే ద్వారకా నగరమే గొప్పగా ఉందని అనుకునేవారు. శ్రీ కృష్ణుని ఇంట్లో ఎప్పుడూ చదువుకున్న వాళ్లకూ బుద్ధిమంతులకూ మర్యాదలు జరుగుతుండేవి.

ద్వారకా నగరానికి చాలా దూరంగా ఒక చిన్న పల్లెలో సుదాముడు అనే పండితుడు ఉండేవాడు. గొప్పగా చదువుకున్నవాడు. చాలా అభిమానం కలవాడు. డబ్బుగల వాళ్లను పొగిడి సంపాదించాలని అతనికి లేదు. మాయ మాటలు చెప్పి పొట్ట నింపుకోవడం తాను చదువుకున్న చదువుకు అవమానం కలిగించడమే అని అనుకునేవాడు. సత్యాన్నీ ధర్మాన్నీ దైవాన్నీ నమ్ముకున్నాడు. ఇలాంటి వాళ్ళకు సుఖంగా జీవితం గడవడం కష్టం. ఈ రోజుల్లో కూడా కష్టమే. ఈ కష్టానికి తోడుగా ఆ సుదామునికి సంతానం ఎక్కువ. బిచ్చమెత్తుకుని వాళ్ళను పోషించడం అతనికి దినదినగండమైంది. ఆకలికి మలమలలాడుతున్న పిల్లలనూ ఇల్లాలినీ పోషించుకోలేక ఎన్నో ఇబ్బందుల పాలైనాడు.

ఒకనాడు సుదాముని ఇల్లాలికి మెరుపులా ఒక ఉపాయం తట్టింది. అతనితో ఇలా అన్నది – "స్వామీ! శ్రీకృష్ణుడూ మీరూ కలిసి చిన్న నాడు సాందీపుని వద్ద చదువుకున్నారు కదా! ఇప్పుడు కృష్ణుడు రాజు. ఆయన తలుచుకుంటే ఏదైనా సహాయం చేస్తాడు. ఒకసారి వెళ్ళి దర్శనం చేసుకుంటే తప్పా?" అప్పుడు సుదాముడు – "నిజమే, కాని నేను ఈ స్థితిలో పోయి అతణ్ణి కలుసుకోవడం నాకెందుకో బాగనిపించడం లేదు. అతణ్ణి చూసి చాలాకాలమైంది. మా అంతస్తుల్లోనూ చాలా తేడాలు వచ్చేసినవి. అతడు గుర్తిస్తాడో లేదో!

ఆదరిస్తాడో లేదో! ఒకవేళ గుర్తించినా ఏమని అడగాలి? స్నేహితుణ్ణి అడిగి మొహమాట పెట్టటం మంచిదేనా? ఐనా సరే. నీవు చెపుతున్నావు కనుక నేను వెళతాను. ఆయన మహారాజు. నేను నిరుపేదను. కానుక ఏమీ లేకుండ ఎప్పుడూ రాజు దగ్గరికి గానీ, పిల్లల దగ్గరికిగానీ, గురువు దగ్గరికి గానీ పోకూడదు కదా!" అన్నాడు. అప్పుడా ఇల్లాలు ఎక్కడనుంచో కొంచెం అటుకులు ఒక చినిగిన బట్టలో కట్టి అందించింది.

సుదాముడు ద్వారకకు చేరుకున్నాడు. చిరిగిన బట్టల్లో ఉన్న అతణ్ణి చూసి ద్వారపాలకులు అడ్డగించినారు. ఒకసారి సుదాముడు వచ్చినాడని చెప్పిచూడండి అని మొరపెట్టుకున్నాడు. ఈ సంగతి ఈ నోట ఆ నోట పడి శ్రీకృష్ణుని దాకా పోయింది. భార్యలు రుక్మిణీ సత్యభామలతో ఉయ్యాల మంచంపై ముచ్చటలాడుతున్న శ్రీకృష్ణుడు సుదాముని పేరు వినగానే తటాలున మంచం దిగి, జారుతున్న ఉత్తరీయాన్ని కూడా సరిచేసుకోకుండా అంతఃపురంలోని వారంతా ఆశ్చర్యంతో చూస్తుంటే తొందరగా పరుగెత్తుకుంటూ సుదాముడు నిలుచున్న సింహద్వారం వద్దకు చేరుకున్నాడు. సుదాముణ్ణి కౌగిట్లోకి చేర్చుకున్నాడు. పట్టలేని సంతోషంతో మిత్రులిద్దరి కళ్ళల్లోనూ నీళ్ళు రాలినవి. కుశల ప్రశ్నలు వేసుకోవడానికి కూడా నోట మాట రాలేదెవరికి.

అంతఃపురంలోకి తీసుకువచ్చినాడు సుదాముణ్ణి శ్రీ కృష్ణుడు. భార్యలు బంగారు చెంబులతో నీరు పోస్తుంటే తాను సుదాముని కాళ్ళు కడిగినాడు. అతిథిగా వచ్చిన వాణ్ణి దేవునిలాగా గౌరవించాలన్నది మన భారతీయుల ఆచారం. రుచికరమైన భోజనాలు ఇద్దరూ కలసి చేసినారు. తన భార్యలు వింజామరలు వీచుతూ ఉంటే శ్రీకృష్ణుడు తమ చిన్ననాటి కథలన్నీ ఒక్కొక్కటిగా జ్ఞాపకానికి తెస్తున్నాడు. వాళ్ళిద్దరూ నవ్వుకుంటున్నారు. ఏడుస్తున్నారు. గురువు సాందీపుడు జ్ఞాపకానికి రాగానే లేచి నిలబడి

"గురుర్ బ్రహ్మ గురుర్ విష్ణుః గురుర్ దేవో మహేశ్వరః
గురు స్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః"

అంటూ తాము చదువుకున్న ఆశ్రమం దిక్కుకు నమస్కారం చేసినారు. కృష్ణుడన్నాడు కదా - "సుదామా! నీకు ఒకనాటి సంగతి జ్ఞాపకముందా? మనం ఒక సాయంకాలం సమిధలు తేవడానికి అడవికి పోయినాం. మనం మన పనిలో ఉండగానే పొద్దుబోయింది. ఇంతలో ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. కుండపోతగా వర్షం కురిసింది. ఎంతసేపు కురిసిందో! మనం నిల్చున్న నేలంతా నీటితో నిండిపోయింది. వానకు తడిసి ఆ చీకట్లో గజ గజ వణకుతూ ఎక్కడో ఒక దిబ్బ మీద మనం మతిదప్పి పడిపోయినాం. భళ్ళున తెల్లవారింది. మన గురువుగారు మనల వెతుక్కుంటూ వచ్చి మనల్ని తాకి చూసినారు. ఆ తాకిడిలో ఎంత శక్తి ఉందో! నీకూ నాకూ ఒకేసారి అనిపించింది కదూ! కళ్ళు తెరవకుండానే అదుగోరా అమ్మ వచ్చింది అన్నాం. చదువుకున్నంతకాలం మనకు అమ్మా నాన్నా గురువుగారే. ఇప్పటికీ ఒక పని చేయాలా చేయకూడదా అని సందేహం వచ్చినప్పుడు మన గురువుగారే మనముందు నిలిచి మనకు సరియైన మార్గమేదో చెపుతున్నట్టూ తోస్తుంది." సుదాముడింకెన్నో ఇలాంటి

కథలు చెప్పినాడు. ఒక కథ చెపుతున్నప్పుడు ఉత్సాహంతో లేచి నిలబడ్డాడు. ఎంతో ప్రయత్నంగా దాచుకున్న ఆ అటుకుల మూట కిందపడింది. కృష్ణుడు ప్రేమతో అందుకుని - "నాకు కానుక తెచ్చినావన్న మాట" - అంటూ పిడికెడు అటుకులు నోట్లో వేసుకున్నాడు. ఎంతో సంతోషపడ్డాడు. చిన్న పిల్లవాడిలా లొటికలు వేసి ఆనందించినాడు. సుదాముణ్ణి సత్కరించి పంపించినాడు.

సుదాముడు ఇంటికి చేరుకున్నాడు. కాని తన పూరిల్లు తనకు కనిపించలేదు. చక్కని ఇల్లూ సుఖ సంతోషాలతో కలకలలాడుతున్న తన ఇల్లాలు, పిల్లలూ కనిపించినారు. ఏమి ఏర్పాటుచేసినాడో మరి శ్రీకృష్ణుడు. తానేదో అడుగబోయినాడు. అడుగలేకపోయినాడు. కాని, తానుకోరింది శ్రీకృష్ణుడు ఇవ్వనే ఇచ్చినాడు. స్నేహం అంటే అదే కదా! ఇదే కథను మహాకవి బమ్మెర పోతన్న తెలుగు మహాభాగవతంలో చక్కని పద్యాలలో వచనాలలో వ్రాసినాడు.

✪ ✪ ✪

గీతాసారము - శాంతికి మార్గము

గతమంతా మంచే జరిగింది.
వర్తమానం కూడా మంచే జరుగుతుంది.
భవిష్యత్తు కూడా మంచే జరుగుతుంది.
నువ్వు ఏం పోగొట్టుకున్నావని అంతలా దుఃఖిస్తున్నావు!
నువ్వు పోగొట్టుకున్న దానిని నువ్వు సృష్టించలేదు.
నువ్వు అనుభవిస్తున్నదంతా ఇహలోకపు సంపదే!
నువ్వు అనుభవించేది ఇక్కడే వదిలివేయాలి.
నువ్వు అనుభవించే ఈ భోగం నిన్న వేరొకరి సొత్తు - నేడది నీదిగా అయింది.
రేపు అది వేరొకరి స్వంతం అవుతుంది. మార్పు అనేది ప్రకృతి సహజం...
కావున జరిగేదేదో జరగక మానదు - అనవసరంగా ఆందోళన పడకు.
ఆందోళన అనారోగ్యానికి మూలం - ప్రయత్న లోపం లేకుండా ప్రయత్నించు.
ఫలితం ఏదైనా, దైవ ప్రసాదంగా స్వీకరించు.
కాలం విలువైనది - రేపు అనుదానికి రూపులేదు.
మంచి పనులు వాయిదా వేయకు.
అసూయను రూపుమాపు - అహంకారాన్ని అణగద్రొక్కు,
హింసను విడనాడు - అహింసను పాటించు.
కోపాన్ని దరి చేర్చకు - ఆవేశంతో ఆలోచించకు.
ఉపకారం చేయలేకపోయినా - అపకారం తలపెట్టకు.
మతిని శుద్ధం చేసేది మతం - *మానవత్వం లేని మతం మతం కాదు.*
దేవుని పూజించు-ప్రాణికోటికి సహకరించు-తద్వారా భగవదాశీర్వాదముతో శాంతి నీవెంట - ఇంట - చెంత ఉండగలదు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

వేగుచుక్కలు

తల్లీ! నిన్ను దలంచి పుస్తకము చేతంబూనితిన్ నీవు నా
యుల్లంబందున నిల్చి జృంభణముగా నుక్తుల్ సుశబ్దంబు శో
భిల్లం బల్కుము నాదు వాక్కునను సంప్రీతిన్ జగన్మోహినీ!
పుల్లబ్జాక్షి! సరస్వతీ! భగవతీ! పూర్ణేందు బింబాననా!

జ్ఞానం తల్లివంటిది. చదువుల తల్లి సరస్వతి. అక్షరాభ్యాసం చేయించేటప్పుడు ఈ పద్యం నేర్పుతారు. ఓ చదువులతల్లీ! సరస్వతీ! నిన్ను తలచుకుని పుస్తకం చేతిలో పట్టుకున్నాను. నీవు నా మనస్సులో నిలిచిపో. నా నోటికి చక్కగా మాట్లాడే శక్తిని ఇవ్వు. నా మాటలు విన్నవాళ్లకు ఆనందం కలగాలి. వాళ్ళ మనస్సు నిండిపోవాలి. అమ్మా! నీవు ఎంతో దూరం చూడగలవు. ఎక్కడికైనా పోగలవు. ఎంతకాలమైనా బ్రతకగలవు. ఎందరి మనస్సులనైనా మార్చగలవు. నీవే జ్ఞానానివి, నీవే సంపదవు, నీవే ధైర్యానివి, నీవే కీర్తివి, నీవే త్యాగానివి. నీ మహిమే గొప్పది. ఇన్ని గుణాలున్న నీవు నా మనస్సులో నిలిచిపోతే నా కెంతో శక్తి వస్తుంది. ఆ శక్తితో నేను ఈ లోకానికి సేవ చేస్తాను.

లోకానికి సేవచేయాలంటే - పుస్తకం - దానివల్ల కలిగే జ్ఞానం-ఆ జ్ఞానం వల్ల పెరిగే వ్యక్తిత్వం అవసరం.

అమ్మా! నీ దయ నాకు కావాలి. నా చేతిలో ఉన్న పుస్తకం నీ దయకు రూపం అని తలుస్తాను. నీ రూపమే అనుకుంటాను. నిన్ను ఇలా ప్రార్థిస్తాను.

"యా కుందేందు తుషారహారధవళా యా శుభ్రవస్త్రాన్వితా
యా వీణావరదండమండితకరా యాశ్వేతపద్మాసనా
యా బ్రహ్మాచ్యుతశంకర ప్రభృతిభి ర్దేవై స్సదా పూజితా
సామాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేషజాడ్యాపహా!"

❋

పన్నెండేళ్ళ అబ్బాయి. చాలా చురుకైనవాడు. ఒక్కసారి చదివితే చాలు పాఠమంతా మనసుకెక్కుతుంది, ఇంట్లో ఉండే తాటాకుల పుస్తకాలన్నీ తిరిగేసే వాడు. తెలుగులో మంచి మంచి పుస్తకాలను చదివి అర్థం చేసుకునే తెలివి అతడికి అప్పటికే అబ్బింది. 'వసుచరిత్ర' చదువ దగిన పుస్తకం అని తెలుసుకున్నాడు. అది కొనాలంటే తాను దాచుకున్న చిల్లర డబ్బులు చాలవు. ఆ రోజుల్లో ఎనిమిది నెలలు బడి ఫీజు ఆ పుస్తకం ధరతో సమానం. అది బడి పుస్తకం కాదు కనుక అమ్మ ఇప్పించదు. తానేమో ఆ పుస్తకాన్ని చదువాలనే కోరికను

అణచుకోలేదు ఏం చేయడం!

దాని ఖరీదు చెల్లేదాకా నెలకింత ఇస్తూ తన దుకాణంలోనే కూర్చుని చదువుకోమన్నాడు ఆ పుస్తకాల వ్యాపారి. సరే బాగానే ఉంది అనుకున్నాడు అతడు. బడిమాని దుకాణంలో కూర్చుని ఆ పుస్తకాన్ని చదవడం మొదలు పెట్టినాడు. ఇలా ఒక నెల గడిచిపోయింది. పిల్లవాడు బడికి పోవడం లేదని తల్లి కెలాగో తెలిసిపోయింది. విషయమంతా కొడుకు నడిగింది. నిజమే! అన్నాడు. సత్యం చెప్పినందుకు ఆ తల్లి సంతోషించి తన కొడుకు మంచి కోర్కెను తీర్చనందుకు బాధపడి ఆ పుస్తకాన్ని కొని ఇచ్చింది. బడిమాత్రం మానవద్దని హితవు చెప్పింది. ఆపైన అతడెన్నడూ బడి మానుకోలేదు. ఇంట్లో ఉన్నా బడిలో ఉన్నా అతనికి చదువంటే మక్కువ ఎక్కువ.

చదువే కాదు, ఆ పిల్లవాడి నడవడి కూడా మంచిదే. ఒకసారి ఒక అధికారి బడి చూడడానికి వచ్చి "మీలో అందరికంటె మంచి పిల్లవాడెవరో ఒక చీటిపై వ్రాసి ఇవ్వండి" అని పిల్లలకు చీటీలు పంచి పెట్టినాడు. చాలా మంది ఆ పిల్లవాడి పేరే వ్రాసినారు.

ఆ పిల్లవాడే పెరిగి పెద్దవాడై ఎన్నో మంచి పుస్తకాలు రచించినాడు. పత్రికలను నడిపినాడు. తెలుగు భాషను, సంఘాన్ని బాగుచేయడం కోసం ఉపయోగించినాడు. అంతేకాదు - స్త్రీలకు విద్య చెప్పించడం, వితంతువులకు పెళ్ళిళ్లు జరపడం, మూఢ విశ్వాసాలను ఖండించడం, కుల మత భేదాలను తొలగించడం - ఇలా ఎన్నెన్నో మంచి పనులు చేసి గొప్ప రచయితగా, గొప్ప సంస్కర్తగా, ఉత్తమ మానవుడుగా చరిత్రలో నిలిచిపోయినాడు. ఇప్పటికీ మన కందరికీ అతడు ఆదర్శంగా ఉన్నాడు.

అతడెవరో తెలుసా?

అతడే కందుకూరి వీరేశలింగం పంతులు!

✻

అమెరికా (యు.ఎస్.ఎ.) స్వాతంత్ర్యయోధుడు, మొట్టమొదటి అధ్యక్షుడు జార్జి వాషింగ్టన్. అతని జీవితం ఎందరికో మంచి బాటను చూపించింది. ఎందరి బ్రతుకులనో వెలిగించింది. అమెరికా దేశీయులకు పూజనీయమైన పుస్తకం అతని జీవిత చరిత్ర.

అమెరికా దేశంలో నగరాలకు దూరంగా అడవుల్లో ఒక కుటుంబం ఉండేది. ఆ కుటుంబంలో ఒక పిల్లవాడు తన సవతి తల్లి వద్ద చక్కగా వ్రాయనూ చదువనూ నేర్చుకున్నాడు. మంచి పుస్తకాలను చదువాలనే ఉత్సాహాన్ని పెంచుకున్నాడు. ఆ నిరుపేద కుటుంబానికి నగరం నుంచి పుస్తకాలను తెచ్చుకునే శక్తి ఎక్కడిది? కానీ ఆ పిల్లవాడు అంతటితో ఊరుకోలేదు. ఆ అడవిలో తన యింటికి దూరంగా అక్కడక్కడా ధనవంతులు కలప వ్యాపారం, వ్యవసాయం చేసుకుంటూ ఉండేవారు. వాళ్ళలో ఒకరింటికి పోయి ఆ పిల్లవాడు జార్జి వాషింగ్టన్ జీవిత

చరిత్ర పుస్తకాన్ని మళ్ళీ ఇస్తానని తెచ్చుకుని శ్రద్ధతో చదువడం మొదలు పెట్టినాడు. ఒకనాడు బాగా వాన పడింది. తామున్న ఇల్లంతా కురిసింది. ఆ పుస్తకమంతా తడిసింది. పుస్తకం యజమాని ఏమంటాడో అని ఆ పిల్లవాడు భయపడ్డాడు. ఆ యజమానికి నిజంగానే కోపం వచ్చింది. ఎంతో కష్టపడి నగరం నుంచి తెచ్చిన పుస్తకం చెడిపోయిందని నొచ్చుకున్నాడు కూడా. అతని బాధను చూసి ఆ పిల్లవాడు ఆ పుస్తకం ఖరీదుకు సరిపోయిన ఏదైనా పనిచేసి పెడతానని బ్రతిమాలుకున్నాడు. ఆ యజమాని సరే అని కొన్ని పనులు చేయించుకుని, ఆ పిల్లవాడికి పుస్తకాల పట్ల గల ఆసక్తిని మెచ్చుకుని పుస్తకాన్నే ఇచ్చి వేసినాడు. ఆ పిల్లవాడికి కొండంత సంతోషం కలిగింది పెన్నిధిలాంటి ఆ గ్రంథాన్ని ఇంటికి తెచ్చుకున్నాడు.

ఒకనాడు ఆ పుస్తకాన్ని తలగడగా పెట్టుకుని తండ్రి నిద్దురపోతున్నాడు. అది చూసిన ఆ పిల్లవాడి హృదయం తల్లడిల్లిపోయింది. మెల్లగా తన తొడను తండ్రికి దిండులా చేసి ఆ పుస్తకాన్ని తీసుకున్నాడు. కళ్ళకు అద్దుకున్నాడు.

ఆ బాలుడే కొన్నాళ్ళకు గొప్ప వక్తయై, సౌజన్యమూర్తియై, పరోపకారియై, ఆ దేశానికే అధ్యక్షుడైనాడు. ఆ తరువాత అతడు తన దేశంలో తోటి మానవులను బానిసలుగా చేసే దురాచారాన్ని రూపుమాపడం కోసం, బానిసల సమస్యవల్ల రెండుగా చీలిపోయిన తన దేశాన్ని ఒకటిగా మలచడం కోసం ఎంతో కష్టపడ్డాడు. తన శక్తియుక్తులన్నీ ధారపోసినాడు. చివరకు మానవత్వాన్ని కాపాడడం కోసం ప్రాణాలనే కోల్పోయినాడు.

ఇంతకూ ఆ మహాపురుషు డెవరు?

ఆ దీనజనబాంధవుడు ఎవరు?

ఆ మంచికి మారుపేరు ఎవరు?

అతడే - అబ్రహాం లింకన్!

*

అందరూ అన్ని పుస్తకాలను కొని చదువలేరు. బడి పుస్తకాలు కొని చదువుకోవడానికే అంతంత మాత్రంగా అవకాశాలుంటాయి. గ్రంథాలయాలలో చదువుకోవడానికి పుస్తకాలు దొరుకుతాయి. ఓపిక ఉంటే చాలు. శ్రద్ధ ఉంటే చాలు. చదువుకొని దేశానికి సేవ చేద్దాం అనే పట్టుదల ఉండాలేగానీ పుస్తకాలకేం కొదవ? పైసా ఖర్చులేకుండ ఎన్ని పుస్తకాలైనా చదువుకోవచ్చు. ఎంత జ్ఞానాన్నైనా సంపాదించుకోవచ్చు.

ఒక రైతుబిడ్డ మన దేశం నుంచి బారిస్టరు చదువుకోసం ఇంగ్లాండుకు వెళ్ళినాడు. ఆ చదువుకోసం ఖరీదైన పుస్తకాలు కావాలి. తన దగ్గర అంత డబ్బు లేదు. అట్లాగని చదువును మానేయలేదుగదా! తానున్న చోటునుండి చాలా దూరం నడిచి గ్రంథాలయానికి పోయి ప్రతిరోజు పదిహేడు గంటలు అక్కడే చదువుకుంటూ ఉండేవాడు. అంటే దినానికి ఏడు గంటలు మాత్రమే వేరే పనులు చేసుకున్నాడనే మాట! పుస్తకాలంటే ఆయనకు అంత

ప్రీతి మరి! ఆయన దృష్టిలో గ్రంథాలయమే దేవాలయం. అతని శ్రద్ధనూ, ఆసక్తినీ మెచ్చి అధికారులు విద్యార్థివేతనాన్ని ఇచ్చి అతణ్ణి ప్రోత్సహించినారు.

ఆ ప్రోత్సాహంతో అతడు మరింత బాగా చదువుకుని బారిస్టరు పరీక్షలో ప్రథమ శ్రేణిలో నెగ్గినాడు. స్వదేశానికి తిరిగివచ్చి మంచి న్యాయవాదిగా పేరు సంపాదించినాడు. గాంధీమహాత్ముని ప్రభావంతో స్వాతంత్ర్య సమరంలో దూకి బ్రిటీషు వాళ్ళను ఎదిరించినాడు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఉప ప్రధానియై మన దేశంలోని చిన్న చిన్న సంస్థానాలను విలీనంచేసి, సమైక్య భారత దేశానికి రూపు దిద్దినాడు. నేర్పుతో, దృఢదీక్షతో పరిపాలన సాగించి 'ఉక్కుమనిషి' అనిపించుకున్నాడు.

ఎవరీ ఉక్కు మనిషి?
ఎవరీ స్వాతంత్ర్య సమరసేనాని?
అతడే సర్దార్ వల్లభాయ్ పటేల్.

*

ఒక చిన్న పిల్లవాడు తల్లితో జాతరకు పోయి తిరిగి వస్తున్నాడు. ఒక పుస్తకాలదుకాణం కనిపించింది. వెంటనే బండి దిగి ఆ దుకాణానికి పోయి "భాగవతం ఉందా?" అని అడిగాడు. పుస్తకాల వ్యాపారి "భాగవతం నీకెందుకు? అది నీకు పనికిరాదు పో!" అన్నాడు. ఆ మాటలు బండిలో ఉన్న తల్లి విన్నది. వెంటనే బండి దిగి దుకాణం దగ్గరికి పోయి ఆమె, "ఆ భాగవతాన్ని ఖరీదుకు ఇచ్చెయ్, పిల్లవాడు చదువుతాడులే" అన్నది. ఆ మాటలు విన్న కొట్టు యజమాని ఆశ్చర్యంతో "ఏమిటి? ఈ పసివాడా భాగవతాన్ని చదివేది? వీడు నిజంగానే చదివితే డబ్బు తీసుకుంటానా? సంతోషంతో ఆ పుస్తకాన్ని ఊరికే ఇచ్చేస్తా" అంటూ భాగవతాన్ని ఆ పిల్లవాడి చేతికిచ్చినాడు. నాలుగైదు చోట్ల చదువుమన్నాడు. అపుడు ఆ పిల్లవాడు అలాగే రాగంతో పద్యాలన్నీ చక్కగా అర్థమయ్యేటట్టు వేగంగా చదివినాడు. అందుకా వ్యాపారి ఆనందంతో పొంగిపోయి ఆ పిల్లవాడికి భాగవతాన్నే కాక కొంత డబ్బును కూడా ఇచ్చివేసినాడు. ఆ పిల్లవాడు తన జీవితంలో సంపాదించిన మొట్ట మొదటి వస్తువు భాగవత గ్రంథమే. ఆ గ్రంథమే అతన్ని ఎంతో గొప్పవాణ్ణి చేసింది. అతడు సంగీతంలో, కవిత్వంలో, నృత్యంలో మంచి నేర్పును సంపాదించి "ఆటల పాటల మేటి" అనిపించుకున్నాడు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు, ఉర్దూ, అరబ్బీ, ఫారసీవంటి ఎన్నో భాషలు నేర్చుకుని మహాపండితుడైనాడు. అనేక పుస్తకాలు వ్రాసినాడు. హరికథలను వ్రాసి వాటిని మనోహరంగా గానం చేసి ప్రజలను ఉర్రూతలూపినాడు. తెలుగుదేశంలోనే కాక భారతదేశమంతటా కీర్తిని సంపాదించినాడు. విశ్వకవి రవీంద్రుని మెప్పును పొందినాడు. తన జీవిత కథను వ్రాసుకున్నాడు. అందులో తాను ఎంత కష్టపడి విద్యలను ఎలా సంపాదించినాడో అందరికీ తెలిసేలా అందంగా చెప్పినాడు. ఎన్నో సన్మానాలనూ గౌరవాలనూ

పొందినాడు. అతణ్ణి గురించి మనకు తెలియకపోతే మనకు తెలుగు కళలను గూర్చి తెలియనట్లే.

ఇంతకూ భాగవతం చదివి మహానుభావుడైన ఆ మనిషి ఎవరు?
హరికథలతో ఆనందాన్ని పంచిపెట్టిన ఆ మహాభక్తు డెవరు?
హరికథా పితామహుడని బిరుదు పొందింది ఎవరు?
అతడే – అజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు!

❋

"ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనమ్మునకగుఁదా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్." – (భారతం)

తెలుగు దేశంలో చాలా మందికి ఈ పద్యం తెలుసు. ఇదిఒక గొప్ప పద్యం. మన భారతదేశంలో పుట్టి గొప్ప పుస్తకాలు వ్రాసిన వాళ్ళూ, రాజ్యాలు ఏలినవాళ్ళూ, ప్రజలకు నీతిబోధ చేసినవాళ్ళూ, ప్రజలకు సేవ చేసినవాళ్ళూ, ఈ పద్యంలోని అర్థాన్ని తెలుసుకున్నవాళ్ళే. నిజానికి ఈ పద్యంలోని అర్థం తెలిస్తే కవిత్వం సంగతి తెలుస్తుంది. అంతకంటే ధర్మం సంగతి బాగా తెలుస్తుంది.

మనం ఎన్నో పనులు చేస్తుంటాం. ఎన్నో మాటలు అంటుంటాం. కాని, కొందరు కొన్ని పనులు చేసినప్పుడు కొన్ని మాటలన్నప్పుడు మనకు బాధ కలుగుతుంది. ఇతరులు ఏ పనులు చేయడం వల్ల మనకు బాధ కలుగుతుందో ఆ పనులు మనం చేయకూడదు. ఇది ధర్మం. అన్ని ధర్మాల కంటె గొప్ప ధర్మం.

"తనయందు నఖిల భూతములందు నొకభంగి
సమహితత్వంబున జరుగువాఁడు
పెద్దలఁ బొడగన్న భృత్యుని కైవడి
చేరి నమస్కృతుల్ సేయువాఁడు
కన్నుదోయికి నన్యకాంత లడ్డంబైన
మాతృ భావము సేసి మరలువాఁడు
తల్లిదండ్రులభంగి ధర్మవత్సలతను
దీనులఁ గావఁ జింతించువాఁడు
సములయెడ సోదరస్థితి జరుపువాఁడు
దైవతములంచు గురువుల దలఁచువాఁడు

లీలలందును బొంకులు లేనివాఁడు
లలిత మర్యాదుఁడైన ప్రహ్లాదుఁ డధిప" - (భాగవతం)

భారతదేశంలో పుట్టినవాడు ఏ విధంగా నడచుకోవాలి? ఎలా చేసినట్లయితే తనకూ ఇతరులకూ మేలు కలుగుతుంది? తాను ఒక మంచిపని చేసినట్లయితే ఇతరులు కూడా ఆ పని చేయడానికి పూనుకుంటారు? దీనినే ఆదర్శమంటారు. భారతీయు దృష్టిలో ఆదర్శ పురుషుడంటే ఎవడు? ఎలాంటి వాళ్ళను ఈ దేశం పూజిస్తుంది?

తెలుగులో బమ్మెర పోతన్న మహాభాగవతాన్ని వ్రాసినాడు. అందులో ప్రహ్లాదుణ్ని గూర్చి వ్రాస్తూ ఉత్తమ మానవుల లక్షణాలను చెప్పడానికి ప్రయత్నించినాడు.ఆ ప్రహ్లాదుడు ఎలాంటివాడు? మనుషులూ పశువులూ పక్షులూ తనవంటి ప్రాణులే అని అనుకునేవాడు. అంటే సకల జీవుల సుఖదుఃఖాలతో పాలు పంచుకునేవాడు.

పెద్దలెవరైనా ఎదురైతే చాలా గౌరవంతో, వినయంతో, ఆదరంతో నమస్కరించేవాడు.

స్త్రీ ఎవరైనా ఎదురైతే తన తల్లిని చూసినట్లే ప్రేమతో చూసేవాడు. తల్లిదండ్రులు ఏ విధంగా తమ పిల్లలను ప్రేమతో చూస్తారో అదేవిధంగా దీనులైన వాళ్ళను ఆదుకోవాలని అనుకునేవాడు.

తోడివారిని స్నేహితులనుకునేవాడు.

గురువును దైవంగా భావించేవాడు.

నవ్వులాటకైనా అబద్ధాలడేవాడు కాదు.

ఇలాంటి గుణాలున్న వాణ్ని లలిత మర్యాదుడు అంటారు. అటే మనోహరమైన ఒకరు నేర్చుకోదగిన అలవాట్లూ, మర్యాదలూ, నడవడీ కలిగినవాడని అర్థం.

"ఉపకారికి నుపకారము
విపరీతము గాదు సేయ వివరింపంగా
నపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాఁడె నేర్పరి సుమతీ!" -(సుమతి శతకం)

మనకెవడైనా మేలుచేస్తే తిరిగి వాడికి మేలుచేయడం ఏమంత గొప్పకాదు. మనకు కీడు చేసిన వాడికి కూడా మనం మేలు చేస్తే అది గొప్ప. అయితే మనకేదైనా లాభం వస్తుందని ఒకరికి సహాయం చేయకూడదు. అట్లా చేసిన సహాయాన్ని సహాయం అనకూడదు. వ్యాపారం అనాలి.

మన దేశంలో గొప్పవాళ్ళు ఈ నీతిని పాటించి దేశానికి గొప్పతనం తెచ్చినారు. ఎందరికో మంచిదారి చూపించినారు.

ఈ మూడు పద్యాలూ, వాటిలోని భావాలూ ఒక పిల్లవాడికి చిన్నప్పుడే

మనసుకెక్కినవి. ఎలాగైనా ఈ పద్యాలలో చెప్పినట్లు నడచుకొని ప్రజలకు సేవచేయాలని తలచుకుని, విద్యార్థి దశనుంచే ఆ పిల్లవాడు తనను తాను మలచుకుంటూ వచ్చినాడు. పెరిగి పెద్దవాడైనాడు. స్వాతంత్ర్య సమరంలో యోధుడైనాడు. ఎన్నో బాధలు పడ్డాడు. అంటరానితనం, పేదరికం, బానిసతనం, అజ్ఞానంవంటి రోగాలతో కుమిలిపోతున్న తన దేశ ప్రజల జీవితాన్ని ఒక నవలగా వ్రాసినాడు. అందరికీ అర్థమయ్యే చక్కని భాషలో వ్రాసినాడు. తనకాలంలోని సంఘం మంచి చెడ్డలను చక్కగా చూపినాడు ఆ నవలలో. ఇప్పటికీ అంత మంచి నవల రాలేదు. ఆ నవల 'మాలపల్లి'. అంతేకాదు, అతడు స్త్రీలకోసం ఒక సంస్థను స్థాపించి, వాళ్ళకు చదువు చెప్పించి, స్వతంత్రంగా జీవితం గడుపుకోవడానికి మార్గం చూపించి గొప్ప సేవ చేసినాడు. గురజాడ అప్పారావు అనే ఒక కవి ఒక మంచి మాట అన్నాడు.

"వట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్
దేశాభిమానం నాకు కద్దని
వట్టి గొప్పలు చెప్పుకోకోయ్"


అన్నాడు. ఈ మాటలను పాటించి చిన్నప్పటినుంచి తన వెంట నీడలా ఉన్న మూడు పద్యాల బలంతో ఆ మహానుభావుడు తెలుగుదేశంలో గొప్ప కీర్తిని సంపాదించినాడు.

భారతం, భాగవతం, సుమతి శతకం పద్యాలతో తాను బాగుపడి, దేశాన్ని బాగుపరచిన ఆ మహానుభావు డెవరు?

'మాలపల్లి' అనే మంచి పుస్తకం వ్రాసిన ఆ గొప్ప రచయిత ఎవరు?

ఆయనే - ఉన్నవ లక్ష్మి నారాయణ పంతులు.

✪ ✪ ✪



వెలుగు చూపే - తెలుగు పద్యాలు

"పద్యం బొక్కటి చెప్పి సార్థముగఁ దాత్పర్యంబు భాషింపుమా!"

ఒక్క పద్యం చెప్పి దానికి అర్థం కూడా చెప్పి నువ్వు ఎంతవరకు చదువుకున్నావో నీకు ఏ మాత్రం అర్థమయిందో వివరంగా చెప్పు - అని అడిగి నాడు హిరణ్యకశిపుడు గురుకులవాసం నుంచి వచ్చిన ప్రహ్లాదుణ్ణి చూసి.

కొద్ది మాటల్లో పద్యంలాగా చెపితే జ్ఞాపకం పెట్టుకొనేందుకు వీలుంటుంది. పద్యంలో అక్షరాలు లయబద్ధంగా - అంటే కొంచెం రాగంతో పాడుకునేందుకు వీలుగా - ఉంటాయి. కనుకనే మనకు పద్యాలూ పాటలూ నోటికి ఎక్కినట్లుగా ఒక పద్ధతిలో - అంటే ఒక క్రమంలో - లేని వాక్యాలు ఎక్కవు. పుస్తకాలు లేని రోజుల్లో మన దేశంలో అన్ని శాస్త్రాలు పద్యాల్లోనే ఉండేవి. ఆ పద్యాలను నోటికి నేర్చుకొని, ఆ తరువాత ఆలోచన చేసి, కృషి చేసి, కొత్త కొత్త విషయాలు కనుగొని వాటిని మళ్ళీ పద్యాల్లోనే భద్రపరచి ముందు తరాలకు అందించే వారు. చిన్నతనంలో మనం కొన్ని మంచి పద్యాలు నోటికి నేర్చుకుంటే మంచిభాష మనకు అలవడుతుంది. ఆడుతూ పాడుతూ చదువులు నేర్చుకోవాలి అంటే ఇదే మరి. పద్యాలు రాకపోతే తెలుగులో మంచి భాష రావడం కష్టం. మంచి భాష అలవడకపోతే ఎంత మంచి ఆలోచనలు వచ్చినా వాటిని మనం మంచి మాటల్లో చెప్పలేం. మంచి వాక్యాల్లో వ్రాయలేం. అప్పుడు సంఘంలో మనం ఏదైనా మంచి పని చేయదలచుకున్నప్పుడు నలుగురితో కలిసిమెలిసి చక్కగా బ్రతుకవలసివచ్చినప్పుడు మనకు ఏదో లోపం ఉన్నట్టు అడుగడుగునా తెలుస్తూ ఉంటుంది. మన భాషలో శక్తి ఉంటే మన వ్యక్తిత్వానికి శక్తి వస్తుంది. అందుకే అన్నారు "నోరు బాగుంటే ఊరు బాగుంటుంది" అని. మనం ఏదైనా మాట్లాడాలనుకున్నప్పుడు పదిలంగా ఆలోచించి మాటాడితే అది వినేవాళ్లను ఆకట్టు కుంటుంది. మాటనుబట్టి ఆ మాటాడేవాడు ఎంతటివాడో మనం ఊహించుకోవచ్చు. మంచి మాట నమ్మకాన్ని కలిగిస్తుంది. నెమ్మదిని కలిగిస్తుంది. చెలిమిని కలిగిస్తుంది. పనిని సులభం చేస్తుంది. బ్రతుకునే బంగారం చేస్తుంది. సీతను వెదకుతూ అడవిలో తిరుగుతున్న రామలక్ష్మణులకు హనుమంతుడు కనిపించినాడు. హనుమంతుని మాట తీరు రామలక్ష్మణులను ఎంతో ఆకర్షించింది. ఆయన ఎంత పండితుడో ఎంత పరిశుద్ధమైన మనస్సు కలవాడో ఎంత నమ్మదగినవాడో ఆయన భాష తెలుపగలిగింది. వాళ్లకెంతో నమ్మకాన్ని కల్గించింది. లంకలో హనుమంతుడు సీతను చూసినప్పుడు సీత హనుమంతుని మాట తీరును చూసి ఊరట పొందింది. ఆమెకు హనుమంతుడు తనవాడేనన్న నమ్మకం కుదిరింది. మాటకు అంతటి శక్తి ఉంటుంది మరి. ప్రపంచంలో గొప్పవాళ్ళు ఎందరో పుట్టి ఎన్నో గొప్పగొప్ప పనులు చేసి మనుష్యుల బ్రతుకులకు ఎంతో హాయిని కలిగించినారు. వాళ్ళు ఎన్నో మంచిమాటలు అందించినారు. సూర్యుడు పొడిస్తే చీకట్లు మాయమైపోయినట్లు

వాళ్ల మాటలను పాటిస్తే మన ఇక్కట్లన్నీ దూరమైపోతాయి.

మనం తెలుగువాళ్లం. అంటే మనం మాట్లాడేభాష తెలుగు. ఈ తెలుగు భాష ఎప్పుడు పుట్టిందో తెలియదు. కాని ఈ భాషలో వచ్చిన మొదటి పుస్తకం మహాభారతం. తొమ్మిది నూర్ల ఏళ్ళ కింద నన్నయ్య ఈ పుస్తకాన్ని వ్రాసినాడు. అప్పటినుంచి ఎన్నో విషయాలను ఒక్క చిన్నమాటలో కుదించి చెప్పే పద్ధతి మొదలయింది. సముద్రాన్ని ఒక గిన్నెలో ఇమిడ్చినట్లు ఒక గొప్ప భావాన్ని ఒక చిన్న పద్యంలో పొదుగడం గొప్పతెలివి. ఆ పద్యంలోని అర్థాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తే మన బుద్ధిని బట్టి, మన అనుభవాన్ని బట్టి, మనకు భాషలో ఉండే జ్ఞానాన్ని బట్టి, ఎన్నెన్నో అర్థాలు తోస్తాయి. కనుక ఎన్ని మంచి పద్యాలు జ్ఞాపకం ఉంటే అంత జ్ఞానం మనకు ఉంటుంది. అయితే ఆ జ్ఞానం నేరుగా కాకుండా మనకు తెలియకుండానే మన మాటల్లోనే చొరబడుతుంది. మనలను మంచి బాటలో నడిపిస్తుంది. అజ్ఞానం అంటే – తెలివిలేనితనం చీకట్లలాగా మన కండ్లకు కమ్ముకున్నప్పుడు ఆ పద్యాలు వెలుతురును చూపుతాయి.

తెలుగులో కొన్ని వేల మంచి పద్యాలున్నాయి. అయితే అన్ని పద్యాలు అందరికీ అన్ని విధాలా అర్థం కావు. ధర్మాన్ని గూర్చిన పద్యాలు ఉన్నాయి. రాజ్యాన్ని గూర్చిన పద్యాలు ఉన్నాయి. కుటుంబ జీవితాన్ని గూర్చిన పద్యాలు ఉన్నాయి. బ్రతుకు బరువులను మరిపించే పద్యాలు ఉన్నాయి. చెట్లనూ గుట్టలనూ, పూలనూ, ఆకులనూ, నదులనూ, సముద్రాలనూ, ఆకాశాన్నీ, చుక్కలనూ, మనిషినీ మనసునూ కష్టాన్నీ సుఖాన్నీ చక్కగా చెప్పే పద్యాలున్నాయి. ముందు ముందు మీరు పెరిగి పెద్దవాళ్లై నన్నయ్య నుంచి ఈనాటి వరకు ఎందరో మంచి మంచి కవులు వ్రాసిన మంచి మంచి పద్యాలను చదివి విజ్ఞానాన్ని పొందండి. ఆనందాన్ని అందుకోండి.

నేను ఇప్పుడు కొన్ని పద్యాలను మీకు చూపి వాటి అర్థాన్ని తెలియజేస్తాను. అయితే ఆ పద్యాలు చదువు గురించి వివేకం గురించి ఉంటాయి. తెలుగులో పేరు మోసిన మహాకవుల పుస్తకాలలో నుంచి ఈ పద్యాలను ఏరుకున్నాను.

ఒక్కమాట. పెద్దలనడిగి ఒక నూరు మంచి తెలుగు పద్యాలను తెలుసుకొని నోటికి నేర్చుకోండి. నూరు పద్యాలు నోటికి వచ్చిన తరువాత మీకు ఏమి తోచిందో మీకు ఎంత సంతోషం కలిగిందో ఎంత లాభం కలిగిందో ఒక్క కార్డులో "యువభారతి-ఆంధ్ర సారస్వత పరిషత్తు భవనములు, తిలక్‌రోడ్, హైదరాబాదు-500 001." అనే అడ్రసుకు వ్రాయండి. తెలుగు బాలబాలికలు తమ భాషను అందంగా తీర్చిదిద్దుకోవాలని మా కోరిక. ఈ కొన్ని పద్యాలు పిల్లల గుండెలలో వెలుగులను కుమ్మరిస్తాయని మా ఆశ.

"చదువని వాఁడజ్ఞుండగుఁ
జదివిన సదసద్వివేక చతురత గలుగుం
జదువఁగ వలయును జనులకుఁ
జదివించెద నార్యులొద్దఁ జదువుము తండ్రీ!"

ఈ పద్యం బమ్మెర పోతన వ్రాసిన శ్రీ మహాభాగవతం లోనిది. హిరణ్యకశిపుడు తన కొడుకు ప్రహ్లాదుణ్ణి చదివించాలని గురుకులానికి పంపిస్తాడు. అప్పుడు కొడుకుతో అన్న మాట ఇది.

నాయనా! ప్రహ్లాదా! నిన్ను నేను చదివిస్తాను. ఆర్యుల వద్దకు వెళ్ళి చదువుకో. చదువుకోని వాడు తెలివిలేనివాడవుతాడు. చదువుకుంటే ఏది మంచిది ఏది చెడ్డది అనే జ్ఞానం కలుగుతుంది. ఆ జ్ఞానమే వివేకం. ఈ వివేకం లేకపోతే లోకంలో మంచి పనులు సాగవు. లోకం చక్కగా నడవదు. కనుక అందరూ చదువుకోవాలె. ఎందుకంటే తెలివి అందరికీ అవసరం.

చిన్నతనంలోనే చదువు నేర్చుకోవాలె. అన్ని దేశాలు చదువుకు ఏర్పాట్లు చేస్తాయి. ఏ దేశంలో చదువుకున్న వాళ్ళు ఎక్కువ ఉంటారో ఆ దేశంలో సంపదలు బాగా ఉంటాయి. ప్రజలు సుఖంగా ఉంటారు. కులం మతం అంతస్తు అనే భేదాలు లేకుండా మనుష్యులంతా చదువుకోవాలె. ఇది ఇప్పటి మాట కాదు. మన పురాణాల్లో ఉంది. ఈ పద్యం ఉన్న భాగవతం పురాణమే మరి.

కొడుకును తండ్రి ఆర్యుల వద్ద చదువుకోమన్నాడు. ఆర్యులంటే ఉత్తములు. బుద్ధిమంతులు. మంచి నడవడి కలవారు. అంతేకాని ఒక జాతివారు కారు. అన్ని జాతుల్లోను తెలివిలేని వారూ తెలివి ఉన్నవారూ ఉన్నట్లే అన్ని జాతుల్లోనూ ఆర్యులూ ఉంటారు. ఆర్యులు కాని వాళ్ళూ ఉంటారు.

చదువు చెప్పేవాళ్లు బుద్ధిమంతులై ఉండాలె. మంచి నడవడి కలిగిన వాళ్లుగా ఉండాలె. ఎంతో వివేకం వాళ్లల్లో ఉండాలె. అలాంటి వాళ్లే ఆర్యులు. వాళ్లు చెప్పితేనే వస్తుంది మంచి చదువు. కనుకనే హిరణ్యకశిపుడు ఆర్యుల వద్దనే చదువు చెప్పిస్తానంటాడు.

"విద్య నిగూఢగుప్తమగు
విత్తము రూపము పూరుషాళికిన్
విద్య యశస్సు భోగకరి
విద్య గురుండు విదేశబంధుఁడున్
విద్య విశిష్టదైవతము
విద్యకు సాటి ధనంబు లేదిలన్
విద్య నృపాల పూజితము
విద్య నెఱుంగనివాఁడు మర్త్యుండే."

ఈ పద్యం ఏనుగు లక్ష్మణ కవి వ్రాసినాడు. అయితే ఏనుగు లక్ష్మణ కవి ఈ పద్యం సంస్కృతంలో భర్తృహరి వ్రాసిన శ్లోకానికి తెలుగు రూపం. భర్తృహరి సుభాషితాలు - అంటే మంచిమాటలు మొత్తం భారతదేశంలో ప్రచారంలో ఉన్నాయి. ఎన్నో భారతీయ భాషలలోని పుస్తకాలలో ఇమిడిపోయినాయి. ఎన్నో నీతిశతకాలకు, ఎన్నో సామెతలకు,

ఎన్నో సూక్తులకు, ఇవి దారితీసినాయి. భర్తృహరి చెప్పిన మంచి మాటలు తెలియని పండితుడు కానీ కవి కానీ భారతదేశంలో దొరకడం కష్టం. ఆయన శ్లోకాలను చాలా మంది తెలుగుకవులు తెలుగుపద్యాలుగా వ్రాసి, తెలుగువాళ్ల గుండెల్లో దీపాలుగా వెలిగించినారు. వాళ్లందరిలో ఏనుగు లక్ష్మణ కవి వ్రాసిన పద్యాలు చాలా వాసికెక్కినాయి. ఇక ఈ పద్యానికి అర్థం వివరిస్తాను.

మనిషికి చదువు దాచిపెట్టిన ధనం. అదే మనిషికి అందం. చదువు వల్ల కీర్తి కలుగుతుంది. సుఖం కలుగుతుంది. అది గురువై అన్ని విషయాలను తెలుపుతుంది. పరదేశంలో బంధువులాగా మనకు సాయపడుతుంది. చదువే దైవం. చదువులాంటి సంపద లోకంలో మరొకటి లేదు. ఎంత పెద్ద పెద్ద పదవుల్లో ఉన్న వాళ్లైనా, ఎంత గొప్పవాళ్లైనా చదువుకున్న వాళ్లను గౌరవిస్తారు. చదువు లేనివాడు మనిషి అనిపించుకోడు.

భర్తృహరి శ్లోకంలో "విద్యా విహీనః పశుః" అన్నాడు. అంటే విద్యలేని వాడు వింతపశువు అన్నాడు. కాని మన తెలుగు కవి పశువు అనకుండా చదువు రానివాడు మనిషేనా అనే అర్థం వచ్చేటట్లు, చదువు రానివాడు చచ్చినవాడే అనే అర్థం వచ్చేటట్లు "విద్య నెఱుంగని వాడు మర్త్యుడే" అని అన్నాడు. 'మర్త్యుడు' అంటే మనిషి. అంటే చనిపోయేవాడు. మనం ఉండే లోకంలో పుట్టిన వాళ్లంతా చనిపోతారు. అందుకే ఇది మర్త్యలోకం. మర్త్యులు కానివాళ్లు దేవతలు. అందుకే వాళ్లను అమరులు అంటే చావులేనివారు - అని అంటారు.

"హర్తకుఁగాదు గోచర
మహర్నిశమున్ సుఖపుష్టిసేయు స
త్కీర్తి ఘటించు విద్యయను
దివ్యధనంబఖిలార్థి కోటికిం
బూర్తిగ నిచ్చినన్ బెరుఁగుఁ
బోదు యుగాంతపువేళనైన భూ
భర్తలు తద్ధనాధికుల
పట్టున గర్వము మానుటొప్పగున్"

ఈ పద్యం కూడా భర్తృహరి శ్లోకానికి ఏనుగు లక్ష్మణ కవి చేసిన తెనిగింపే.

విద్యను దొంగలు ఎత్తుకొని పోలేరు. విద్య సుఖపెడుతుంది. సుఖాన్ని మరింత పెంచుతుంది. మంచి కీర్తిని సంపాదించి పెడుతుంది. విద్య తరిగిపోని సంపద. అడిగిన వాళ్లకు ఎంత ఇచ్చినా అది తక్కువకాదు. సరికదా మరింత పెరుగుతుంది. ఈ ప్రపంచమంతా మునిగిపోయినా విద్య ఎక్కడికి పోదు. ధనం ఉన్న వాళ్లు. అధికారం ఉన్న వాళ్లు, బలం ఉన్నవాళ్లు చదువుకున్న వాళ్లను అవమానించకూడదు. వాళ్ల ముందు తాము గొప్పవాళ్లమని గర్వించకూడదు.

లోకంలో కనిపించే సంపదలు అంటే - ధనం, ధాన్యం, భూములు, పశువులు, మేడలు, వాహనాలు ఇంకా ఇలాంటివి మరెన్నో- ఉంటాయి. వాటిని ఎవడైనా తన బలంతోనో మోసంతోనో దోచుకోవచ్చు. సొంతం చేసుకోవచ్చు. కొన్ని సంపదలు ఉంటాయి. అవి ఎవరికీ కనపడవు. ఎప్పుడూ కనపడవు. అందులో విద్య ఒకటి. ఇది మనిషి లోపల దాగి ఉంటుంది. దీనిని ఎవడూ కొట్టి తీసికొనిపోలేడు. మోసం చేసి తీసుకొని పోలేడు. అందుకే అది గొప్ప ధనం. అయితే డబ్బూ మడులూ మాన్యాలూ పశువులూ ఎవరికైనా ఇస్తే తక్కువవుతాయి. కాని తనలో ఉన్న చదువు ఎవరికైనా అందిస్తే అది మరింత ఎక్కువవుతుంది. ఎంత చిత్రమైన విషయం! అన్ని కాలాల్లోనూ చదువు నశించకుండా ఉంటుంది. అంటే మనిషి సంపాదించుకున్న జ్ఞానం ఎప్పటికీ భద్రంగా ఉంటుందన్న మాట. ఎంతబలం ఉన్నా ఎంత అధికారమున్నా ఎంత బలగం ఉన్నా చదువుకున్న వాళ్లను అవమానించకూడదు. వాళ్ల చదువును ఎవ్వడూ లాగుకొనిపోలేడు. ప్రపంచంలో ఎక్కడికైనాపోయి చదువుకున్నవాళ్లు తమ చదువుతో బ్రతుకుతారు. బ్రతికిస్తారు. బమ్మెర పోతన అనే కవిని తన అదుపులో ఉంచుకోవడానికి సర్వజ్ఞ సింగ భూపాలుడు ఎంతో బలాన్ని ఉపయోగించినాడు. కానీ ఏమీ చేయలేకపోయినాడు. తన చదువునూ తన దేవుణ్ణీ నమ్మిన పోతన్ననూ ఏమీ చేయలేకపోయినాడు. చివరకు అతడు పోతన జ్ఞానానికి లొంగిపోయినాడు. ప్రపంచంలో చదువుకున్న వాళ్లతో పగను పెంచుకొని ఎందరో రాజులూ అధికారులూ మంచితనానికి అడ్డుగోడలైనారు. కానీ చదువుకున్న వాళ్ల బలం ధనం కనపడవు కానీ అవి ఆ అడ్డుగోడలను కూలగొట్టి ముందుకు సాగినాయి.

ఇక్కడ మీ కొక్క మాట చెపుతాను. చదువంటే విద్య అంటే ఒక్క కవిత్వమే కాదు. సంగీతం, నృత్యం, చిత్రలేఖనం శిల్పం, విజ్ఞాన శాస్త్రాలూ, ధర్మ శాస్త్రాలూ, ఆయుర్వేదం, సాంఘిక శాస్త్రాలూ, చరిత్ర భూగోళం, గణితం ఇంకా ఎన్నో ఎన్నో. మొత్తానికి మనిషి బ్రతుకును బాగుపరిచేదీ, మనిషికి వెలుగుబాట చూపేదీ, మనిషికి నిజమైన సంతోషాన్ని ఇచ్చేదీ విద్య అనిపించుకుంటుంది. ఏ తెలివి వల్ల మనుషుల మధ్య ప్రేమ పెరుగుతుందో, మరి ఏ తెలివి వల్ల మనిషి తననూ తన పరిసరాలనూ తనను పుట్టించిన దేవుణ్ణీ తల్లిదండ్రులనూ అర్థం చేసుకోగలుగుతాడో ఆ తెలివే విద్య. అలాంటి విద్యను సంపాదించుకుంటే ఎవ్వడూ తీసుకుపోలేడు.

"భూషలు గావు మర్త్యులకు
భూరిమయాంగద తారహారముల్
భూషిత కేశపాశ మృదు
పుష్ప సుగంధ జలాభిషేకముల్
భూషలుగావు పూరుషుని
భూషితుఁజేయుఁ బవిత్రవాణి వా

వ్వాభూషణమే సుభూషణము
భూషణముల్ నశియించు నన్నియున్."

మనుష్యులకు మణులు పొదిగిన బంగారు హారాలు అలంకారాలు కావు. చక్కగా అలంకరించుకున్న వెంట్రుకలు మనిషికి అందాన్ని తెచ్చిపెట్టవు. పూలు ముడుచుకున్నా వాసనలు గుప్పుమనే మైపూతలు పూసుకున్నా, పన్నీటిలో స్నానాలు చేసినా మనిషికి నిజమైన అందం రాదు. శాస్త్రప్రకారంగా తీర్చిదిద్దినమాట మనిషికి మంచి అలంకారం. అన్ని అలంకారాలు నశించిపోతాయి. కానీ మంచి మాట, అందమైనమాట, నిజమైన మాట ఎప్పటికీ ఉంటుంది.

ఈ పద్యం కూడా భర్తృహరి సంస్కృత శ్లోకాన్ని చూసి వ్రాసిందే. ఏనుగు లక్ష్మణకవి వ్రాసిందే. అందాలూ అలంకారాలూ మనిషికి కలిగించే అందమైన రూపం ఎంతో కాలం ఉండదు. పైగా దానికోసం పడే కష్టం పెద్ద లాభాన్ని తెచ్చి పెట్టదు కూడా. శరీరంలోని ఏ అవయవాన్నైనా మనం కొంత ప్రయత్నం చేసి అందంగా మార్చుకోవచ్చు. తెల్లబడిన వెంట్రుకలను నల్లగా చేసికోవచ్చు. ఎగుడుదిగుడు దంతాలకు బదులు దానిమ్మగింజలవంటి దంతాలను పెట్టుకోవచ్చు. పెదవులకు రంగు వేసికోవచ్చు. కండ్లకు కాటుక పెట్టుకోవచ్చు. శరీరానికంతా రంగు పులుముకొని ఎర్రగా బుర్రగా కనిపించవచ్చు. తళ తళ మెరిసే నగలు పెట్టుకొని చూసేవాళ్ళ కళ్ళను జిగేలుమనిపించవచ్చు. ఒక్క నాలుకను తప్ప ఏ అవయవాన్నైనా అందంగా తీర్చిదిద్దుకోవచ్చు. మరి నాలుక అందంగా ఉండాలంటే ఏం చేయాలి? చక్కగా చదువుకోవాలి. తప్పులు లేకుండా మాట్లాడాలి. ఒకరి మనస్సు బాధపడేటట్లు కాకుండా సుఖపడేటట్లు మాట్లాడాలి. ఇతరుల మనస్సులకు హత్తుకొని పోయేట్లుగా మాట్లాడాలి. మాటకు ఇంత శక్తి రావాలి అంటే చక్కగా చదువుకోవడం ఒక్కటే మార్గం. మనం ఏదైనా మాటంటే ఆ మాటవల్ల మన నాలుక ఎంత అందమైందో వినే వాళ్ళు తెలుసుకోగలగాలి. ఇక్కడ మీకొక సంగతి చెపుతాను. ఏడు నూర్ల ఏళ్ళ క్రితం మన దేశంలో ఒక పెద్దకవి ఉండేవాడు. అతని పేరు తిక్కన సోమయాజి. నన్నయభట్టు కొంత వ్రాసి వదలిపెట్టిన మహాభారతాన్ని పూర్తి చేసిన మహానుభావుడాయన. తెలుగుదేశాన్నంతా తొలిసారిగా ఒకే గొడుగు కిందికి తెచ్చిన కాకతీయ గణపతిదేవ చక్రవర్తి ఆ మహాకవికి పూజలు చేసినాడు. తిక్కన తన కాలంలో దేవుని పేరుతో జరిగే పోట్లాటలను ఆపడానికి గొప్ప ప్రయత్నం చేసినాడు. శివుడన్నా కేశవుడన్నా ఒకే దేవుడని ఆయన అప్పటి ప్రజలకు నచ్చజెప్పి దేశానికి నెమ్మదినీ శాంతిని అందించిన మహాపురుషుడు. ఆయనకు ఎందరో శిష్యులుండేవారు. వాళ్ళంతా గొప్ప పండితులు. గొప్ప గొప్ప పుస్తకాలు వ్రాసినవాళ్లు. వారిలో ఒకడు కేతన. ఆయన 'దశ కుమార చరిత్రము' అనే ఒక పుస్తకాన్ని వ్రాసి తిక్కనకు అంకితం చేసినాడు. ఆ పుస్తకంలో తన గురువు తిక్కనను గూర్చి

"సుకవీంద్ర బృంద రక్షకుడెవ్వడనిన వీ
దను నాలుకకు తొడవైనవాడు"

అని అన్నాడు. తిక్కన సోమయాజి నాలుకకు నగవంటి వాడట. అంటే 'తిక్కన సోమయాజి' అనే మాట నాలుకకు అందాన్ని కలిగిస్తుందని కేతన చెప్పినాడు. తిక్కన భాషకే అలంకారమని కూడా కేతన మాటకు అర్థం. తిక్కన అంటే పండితుడు, పవిత్రుడు అని అందరికీ తెలుసు. మరి ఆ మాట అన్నప్పుడు నాలుక ఎంత పుణ్యం చేసుకుంటుందో. ఎంత విలువను సంపాదించుకుంటుందో. 'వాగ్భూషణమే సుభూషణము' అనే మాట ఈ పద్యంలో ఉన్నది. అంటే ఎవని మాట మంచిదో ఎవని మాటకు మంచి అర్థం ఉందో ఎవని మాట అందంగా ఉందో వాడు నిజంగా అందమైనవాడు. మంచి మాటకున్న విలువ బంగారానికి ఉందా? పై పూతలకు ఉన్నదా? పై మెరుపులకు ఉన్నదా? చక్కగా అలంకరించుకొని సభలోకి పోయి వికారంగా మాట్లాడితే, అర్థం లేకుండా మాట్లాడితే, ఎక్కడి అందం? ఏమవుతుంది తెచ్చి పెట్టుకున్న అందం గతి? సాధనవల్ల శ్రద్ధవల్ల వచ్చే చదువు మనిషి విలువను పెంచుతుంది. చదువువల్ల వచ్చిన అందచందాలు మాటలో కనిపిస్తాయి. మాటవల్లే మనిషి గుర్తింపునకు వస్తాడు. మంచి మాట రానివాడు ఎన్ని వేషాలు వేసినా వెర్రి వేషాలే అవుతాయి. ప్రతి మానవుడు ఈ విషయం తెలుసుకోవాలి. భర్తృహరి చెప్పిన ఈ మాటను ఆయన భాషలోనే నేర్చుకోవాలి. ఇదీ ఆ శ్లోకం. నోటికి నేర్చుకోండి.

"కేయూరాణి న భూషయన్తి పురుషం హారాన చంద్రోజ్జ్వలా
న స్నానం న విలేపనం నకుసుమం నాలంకృతామూర్ధజాః
వాణ్యేకా నమలంకరోతి పురుషం యా సంస్కృతా ధార్యతే
క్షీయన్తే ఽ ఖిలభూషణాని సతతం వాగ్భూషణం భూషణమ్"

మన తెలుగువాళ్లల్లో చదువుకున్న వాళ్లందరికీ వేమన్న చెప్పిన ఒక్క పద్యంతోనైనా పరిచయం ఉంటుంది. వేమన్న చెప్పిన మాటలు చదువురాని వాళ్లలో కూడా బాగా పాకిపోయినాయి. రెండు మూడు నూర్ల ఏళ్ల కింద వేమన్న తెలుగుదేశంలో తిరిగి ఎన్నో విషయాలపైన పద్యాలు చెప్పినాడు. ప్రజల్లో పాతుకుపోయిన ఎన్నో గుడ్డి నమ్మకాలను చెడు అలవాట్లను అతడు అందరికీ తెలిసే భాషలో అందరి నోటికీ సులభంగా వచ్చే పద్యాల్లో ఎత్తి చూపినాడు. కులం కట్టుబాట్లను తప్పు అన్నాడు. మతం పేరుతో వేసుకునే వేషాలను చేసే మోసాలను బట్టబయలుచేసినాడు. అతడు ఎన్నో వేల పద్యాలు చెప్పినాడని అందరూ అనుకుంటారు. కాని మనకు కొన్ని మాత్రమే దొరికినాయి. మానవుని బ్రతుకును గూర్చి ఆయన ఎంతో నేర్పుతో ఆలోచనలు చేసి మంచి మార్గాలను ఎన్నింటినో చూపినాడు. చదువును గూర్చి ఆయన ఎంత చక్కగా చెప్పినాడో చూడండి.

"చదువు చదువకున్న సౌఖ్యంబులును లేవు
చదువు చదివెనేని సరసుడగును

చదువు మర్మమెఱిగి చదువగ చూడుము
విశ్వదాభిరామ వినురవేమ."

చదువుకోకపోతే సుఖం దొరుకదు. చదువుకుంటే సరసుడౌతాడు మనిషి. సరసుడంటే - ఒప్పూ తప్పూ తెలిసినవాడు. ఒకరిలోని మంచిని చూసి సహించే గుణమున్నవాడు. తనకు నచ్చని మాట ఎవడైనా అంటే కోపం తెచ్చుకోకుండా ఆ మాటలో ఎంత సత్యముందో తెలుసుకునే ఓపిక ఉన్నవాడు. తనకే అంతా తెలుసునని మొండిపట్టులేనివాడు. వేమన్న దృష్టిలో చదువంటే కేవలం వల్లించడ్రం వ్రాయడం కాదు. పైపైకి చదువడంకాదు. అర్థం తెలుసుకోవాలి. రహస్యం తెలుసుకోవాలి. ఎన్ని తీర్ల చూడగలిగితే అన్ని తీర్లతో చూసి సరియైన సంగతిని తెలుసుకోగలగాలి. అంతేగాని పుస్తకంలో ఉన్నదల్లా నోటికివస్తే అది సగం చదువే అవుతుంది కాని పూర్తి చదువు కాదు. ఆ పుస్తకంలో ఉన్న సంగతీ సందర్భమూ బాగా తెలుసుకోగలగాలి. అందులో తనకు నచ్చిన మాటను జీవితంలో చేసి చూపించాలి. లోకంలో మనం చాలా మందిని చూస్తాం. బాగా చదువుకున్న వాళ్లను చూస్తాం. కాని వాళ్లచదువు వాళ్లకు అర్థమైనట్లు కనిపించదు. ఎందుకంటే చదువురానివాడు చేసే తప్పుల కంటే వాళ్లు చేసే తప్పులు ఎక్కువగా ఉంటాయి. లంచాలు తీసుకుంటారు. అబద్ధాలు చెపుతారు. మాయమాటలు చెప్పి పబ్బం గడుపుకుంటారు. తాము చేసింది తప్పే కాదని ఇతరులకు నచ్చచెప్పడానికి తమ చదువునంతా వాడుకుంటారు. వేమన్న ఇలాంటి వాళ్లనే 'మర్మ మెఱిగి' చదువనివాళ్లు అన్నాడు. చదువుకుంటేనే మనిషి మంచివాడై దేశానికి పనికివస్తాడు. కొంచెం చదువుకున్నా ఆ చదువుకున్నది చక్కగా తెలుసుకుంటే మంచిది. ఎక్కువ చదివి తక్కువ తెలుసుకుంటే తనకూ లాభం లేదు, తన వాళ్లకూ లాభం లేదు. అందుకే మరొక చోట వేమన్న ఈ మాటనే మరోతీరుగా అన్నాడు.

"గంగ గోవుపాలు గంటెడైనను చాలు
కడివెడైననేమి ఖరము పాలు"

మంచి ఆవు పాలు కొంచెమే చాలు. కడివెడు గాడిదపాలు ఎందుకు?

"విద్య యొసఁగును వినయంబు వినయమునను
బడయు పాత్రత పాత్రత వలన ధనము
ధనము వలనను ధర్మంబు దానివలన
నైహికాముష్మిక సుఖములందు నరుడు"

ఈ పద్యం పరవస్తు చిన్నయసూరి వ్రాసిన 'నీతి చంద్రిక' అనే పుస్తకంలోనిది. తెలుగులో ఉన్న మంచి పుస్తకాలలో నీతిచంద్రిక ఒకటి. మన తెలుగు భాషకు ఎంత అందం ఉందో ఈ పుస్తకం తెలుపుతుంది. మీరెన్నో నీతి కథలు విని ఉంటారు. ఆ నీతి కథల్లో పిల్లులు, నక్కలు, కాకులు, పావురాలు, సింహాలు, కుందేళ్లు, ఎలుకలు, ఎద్దులు పాత్రలుగా ఉంటాయి. ఈ కథల్లో ఎన్నో మంచిమాటలు ఎంతో జ్ఞానం నిండి ఉన్నాయి. ఈ కథలను పంచతంత్రం

కథలు అంటారు. ప్రపంచం అంతటా ఈ కథలు భారతదేశం నుంచి పాకి పోయినాయి. పంచతంత్రం అనే ఈ కథల పుస్తకాన్ని సంస్కృతంలో విష్ణుశర్మ వ్రాసినాడు. ఈ పంచతంత్రంలోని మిత్రలాభం మిత్రభేదం అనే రెండు భాగాలను చిన్నయసూరి 'నీతిచంద్రిక' అనే పేరుతో తెలుగులో వ్రాసినాడు. ఈ పుస్తకమే కాకుండా తెలుగు భాషకు చక్కని వ్యాకరణాన్ని కూడా అతడు వ్రాసి మనకు ఎంతో మేలు చేసినాడు.

ఈ పద్యం చదువు గొప్పతనాన్ని వివరిస్తున్నది. విద్య వినయాన్ని అంటే అణకువను నేర్పుతుంది. వినయం వల్ల పాత్రత అంటే యోగ్యత కలుగుతుంది. యోగ్యతవల్ల ధనం లభిస్తుంది. ధనం వల్ల మంచి పనులు చేయడానికి అవకాశాలు ఎక్కువవుతాయి. మంచి పనులు చేస్తే ఈ లోకంలోనూ పరలోకంలోనూ మనిషికి సుఖం కలుగుతుంది.

బాగా చదువుకుంటే ఎంతో అణకువ అలవడుతుంది. ఏమీ తెలియని వానికి అంతా తెలిసినట్టే అనిపిస్తుంది. కొంత తెలిస్తే ఎంతో తెలుసుకోవాలనిపిస్తుంది. తెలుసుకోవాలనే కోరిక మనిషిని ఎంతో తీర్చిదిద్దుతుంది. తానెంతటివాడో తనకెంత తెలుసునో తెలుస్తుంది. అప్పుడు గర్వం మానుకొని మనిషి తన అదుపులో తానుంటాడు. దీనివల్ల మనిషి యోగ్యుడవుతాడు. అంటే ఏదైనా పని చేయడానికి తగిన శక్తిని సంపాదించుకుంటాడు. చక్కగా చదువుకొని అణకువతో యోగ్యత సంపాదించుకొని సంఘంలో గొప్పవాడు కావాలి కాని కులంవల్ల డబ్బు వల్ల అధికారం వల్ల మనిషికి వచ్చే గొప్పతనం ఎండమావుల వంటిది. ఎండమావులు దూరం నుంచి నీళ్ల అలల్లాగా కనిపిస్తాయి. కానీ నిజానికి అక్కడ నీళ్లుండవు. యోగ్యత ఉంటే కొంచెం డబ్బు సంపాదించుకోవచ్చు. చదువు వల్ల యోగ్యతవల్ల సంపాదించుకున్న ధనాన్ని మనిషి మంచిపనులకే ఉపయోగిస్తాడు. సంఘంలో ఇలాంటి వాళ్ల వలన ఎంతో స్నేహం ఎంతో శాంతి ఎంతో హాయి కలుగుతుంది. మనిషి ఇలాంటి పనులు చేయడం వల్ల ఈ లోకంలో సుఖపడతాడు. చనిపోయిన తర్వాత పరలోకంలో కూడా సుఖపడతాడు. చిన్నయసూరి చదువు వల్ల చివరకు మోక్షం కూడా దొరుకుతుందని తెలియజెప్పినాడు. మోక్షం అంటే ఈ లోకంలోని చిక్కులలోనుంచి బయటపడడం.

మంచి ఏదో చెడ్డ ఏదో తెలుసుకోవగలడం వివేకమనిపించుకుంటుంది. చదువువల్ల అనుభవం వల్ల మంచివాళ్ళతో స్నేహం వల్ల దేశం మీద ప్రేమ వల్ల మనిషికి వివేకం కలుగుతుంది. వివేకం ఉన్నవాడు అనవసరంగా బాధపడడు. భయపడడు. నిర్భయంగా ఉండే మనిషి మంచిపనులు సాధించేటప్పుడు చాలా ధైర్యంతో మెలకువతో నమ్మకంతో ముందుకు సాగిపోతాడు.

మన తెలుగులో మొట్టమొదటి కవి అయిన నన్నయభట్టు వివేకవంతుడు ఎట్లా ఉంటాడో ఒక పద్యంలో చెప్పినాడు.

"శోక భయ స్థానంబుల
నేంకబులు గలిగినను విహీన వివేకుం
డాకులతఁ బొందునట్లు వి
వేకము గలవాఁడు బుద్ధివికలుండగునే"

ఈ పద్యం మహాభారతంలో అరణ్య పర్వంలో ఉంది.

జీవితంలో దుఃఖం కలిగినా భయం కలిగినా వివేకం లేనివాడు చాలా బాధపడతాడు. వాని బుద్ధిపనిచేయదు. అలాంటి వానివలన ఎంతో మందికి బాధ కలుగుతుంది కాని వివేకమున్నవాడు ఎప్పుడూ ఓర్పునుకోల్పోడు. భయపడడు. కష్టాలు ఎదురైతే చాలా ధైర్యంతో వాటిని పక్కకునెట్టి ముందుకు సాగిపోతాడు. మంచి వివేకమున్నవానికి దుఃఖమూ ఉండదు. భయమూ ఉండదు. ఈ రెండింటిని జయించినవాడు మహానుభావుడు. గాంధీమహాత్మునికి ఆయుధాలు లేవు. సైన్యం లేదు. సంపద లేదు. అధికారం లేదు. తాను బక్కపలుచనివాడు. అయినా ఆయనలోని వివేకం ఆయనకు ఎంతో శక్తిని ఇచ్చింది. అన్ని శక్తులూ ఉన్న ఇంగ్లీషు సామ్రాజ్యంతో ఆయన ఏమీ భయం లేకుండా పోరాడినాడు. కష్టాలు వచ్చినప్పుడు ధైర్యంతో ఎదుర్కొన్నాడు. ఆయన వివేకం ఆయన మాటల్లోకి ప్రవేశించింది. ఆ మాటలు బాణాల్లాగా దూసుకుపోయినాయి. కఠినులైన ఇంగ్లీషు పాలకుల గుండెల్లోకి. ఆయన బుద్ధి ఎపుడూ వికలం కాలేదు. అంటే సతమతం కాలేదు. చెల్లా చెదరు కాలేదు. భయమున్న వానికీ, సుఖాలమీద ఆశలున్న వానికీ వివేకం కలుగదు. తనపైన తనకు నమ్మకం లేనప్పుడే భయం పుట్టుకొస్తుంది. తనకు గౌరవమో ధనమో కావాలనుకున్నప్పుడు భయం పుట్టుకొస్తుంది. ఆ భయం వివేకాన్ని దగ్గరికి రానీయదు.

శ్రద్ధతో చదువుకొని తనపై నమ్మకం పెంచుకున్నవాడు వివేకవంతుడవుతాడు. ఈ పద్యంలో నన్నయ్య చెప్పింది ఇలాంటి వివేకిని గురించే.

ఒక మాట చెప్పి ముగిస్తాను.

రోజూ ప్రొద్దున్నే లేవగానే "నేను బాగా చదువుకొని నా దేశానికి సేవ చేస్తాను. భగవంతుడా! నాకు వివేకాన్ని ప్రసాదించు" - అని ప్రార్థించు.

కాలము

అప్పుడొక ఖగోళశాస్త్రజ్ఞుడు
"కాలము" అననేమిటి అని ప్రశ్నింపగ
పలికెనిటుల అల్‌ముస్తఫ.
కొలతలేని కొలచుటకువీలుకాని
కాలమును మీరెప్పుడు కొలుస్తారు
గంటలకు ఋతువులకు అనువుగాను,
మీ జీవన ప్రవాహాన్ని, మీ ఆత్మశక్తి విద్యుత్తును
అదుపులోకి తెచ్చుటకై యత్నింతురు.
అందుకు తగినట్లు మీరు మీ నడవడిని, నైజమును సదురుతారు,
కాలమును, నదియనుకొని, దాని ప్రవాహాన్నిచూడ
గట్టుమీద కూర్చుందురు.
అయినా - మీలోని కాలాతీతమగు శక్తికి
జీవనము కాలాతీతమని సంపూర్తిగ గుర్తున్నది.
అది యెరుగును -
"నిన్న" నేటి స్మృతిమాత్రమెయని,
"రేపు" నేటి స్వప్నంబని
మరియు మీలోనిది, పాటలు పాడేది, చింతనచేసేది,
చుక్కలు వెదజల్లబడిన క్షణమునుండి ఈనాటికి
ఆకాశములోనె నిలచివున్నది.
ఇంతకూ ప్రేమశక్తి, అనంతమ్మని ఎరుగనివాడెవ్వడు?
ఇట్లయ్యును ఆ ప్రేమయె తానెల్లలు ఎరుగనిదయ్యును,
మీ జీవితవలయాలచిక్కి, మర్యాదల పాటిస్తూ
కేంద్రబిందువై నిలుచును, చైతన్యము కోలుపోయి.
అదిచేరలేదు, ఒక ప్రేమ భావనను వదలి మరోప్రేమ భావనకడకు,
అది చేబట్టలేదు, ఒక ప్రేమకలాపమును వదలి
మరో ప్రేమ కలాపమును. ప్రేమకు వలెనే కాలము,
అఖండము, స్థలాతీతము కాదామరి?
అయినా ఒకవేళ మీరు వూహాసామ్రాజ్యములో
కాలమును, ఋతువుల్లో కొలవ నెంచినచో -
ప్రతి ఋతువును అన్ని ఋతువులు కలదానిగ కొల్చుకొనుడు,
'నేటిని' స్మృతి విహ్వలమై గతదినమును కౌగలించుకొన జేయుడు
కలయిక తహతహతో దానినే 'రేపు' వైపు చేతులు జాచునట్లొనరింపుడు.

ఖలీల్ జిబ్రాన్ "ది ప్రాఫెట్"కు కాళోజీ తెలుగుసేత 'జీవనగీత' నుండి

తెలుగు ఎదలో తెలుగుతనం
వెల్లువలా పారాలని
తెలుగింటిలో తెలుగుదీపం
అఖండంగా వెలగాలని
ఈ జాతి నిద్రలేచి
మహోన్నత మానవాదర్శాల వైపు
నిరంతర కృషితో
పయనం కొనసాగించాలనే ధ్యేయంతో
ఉడుతా భక్తిగా యువభారతి కృషిచేస్తున్నది
భాషాభిమానం కలగాలంటే
మాతృభాషా సాహిత్య పఠనమే
ప్రథమ కర్తవ్యం అనే భావం
బలంగా మనసులో నాటుకోవడానికి గాను
వీలైనంత ఎక్కువ మందికి వీలైనంత తక్కువ వెలకు
ఉత్తమ సాహిత్యం అందించేందుకు
యువభారతి పూనుకున్నది
ప్రతి తెలుగింటిలో
కనీసం పదయినా తెలుగు పుస్తకాలు ఉండేందుకు
మనందరం ఉద్యమ వేగంతో కృషి చేద్దాం
ఆ పదిమంది పుస్తకాలలో ఏ ఒక్కటిగానైనా
యువభారతి ప్రచురణ ఏ ఒక్కటైనా
ఉండాలనే ధ్యేయంతో కృషిచేద్దాం

యువభారతి

సాహితీ సాంస్కృతిక సంస్థ
ఆంధ్రసారస్వత పరిషత్ భవనములు,
తిలక్ రోడ్, హైదరాబాదు - 500 001.